MAHANAGAR DINAPATRIKA

మహానగర్

విజయవాడ | సంపుటి : 10 | సంచిక : 281 | పేజీలు : 8 | బుధవారం 30 సెప్టెంబర్ 2026 | వెల : 6-00



‘తరంగ్ శక్తి’ విన్యాసాల్లో అమెరికా ఏఫ్-35 యుద్ధ విమానాలు ఎంట్రీ

- హర్షం వ్యక్తం చేసిన యూఎస్ ఎంబసీ
- సెప్టెంబర్ 26-అక్టోబర్ 12 వరకు రాజస్థాన్‌లో ‘తరంగ్ శక్తి’ విన్యాసాలు
- ఈ సైనిక విన్యాసాల్లో యూఎస్‌కు చెందిన ఏఫ్-35 యుద్ధ విమానాలు అరంగేట్రం
- భారత్‌లోని అమెరికా ఎంబసీ పోస్ట్



భారత్- చైనా మధ్య సంబంధాలు గతంతో పోలిస్తే మెరుగ్గా ఉన్నాయి

- సరిహద్దు సమస్యలు పరిష్కారం కావడంతో ఇరు దేశాల సంబంధాలు సాధారణ స్థితికి చేరుకుంటున్నాయని వెల్లడి
- న్యూయార్క్‌లో ‘ఆసియా సొసైటీ’లో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న జైశంకర్

పెత్తందార్లం కాదు..

ప్రజలకు సేవకులం



ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పాలన

పల్లె పండుగ-3.0లో రూ.11,085 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

గ్రామీణ ప్రాంతాల్లో సీసీ, బీటీ రోడ్ల నిర్మాణానికి భారీగా నిధులు

పల్లె వికాసంలో పవన్ కళ్యాణ్ తనదైన ముద్ర వేశారు

గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యం

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

ఉదయగిరి, మహానగర్

ప్రజలకు సేవ చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, తాము ప్రజలకు సేవకులమే తప్ప పెత్తందార్లం కాదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. వరికుంటపాడు మండలం రామాపురంలో మంగళవారం నిర్వహించిన పల్లె పండుగ-3.0 కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో కలిసి రూ.11,085 కోట్ల విలువైన గ్రామీణ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఇందులో రూ.2,700 కోట్లతో 6 వేల కిలోమీటర్ల సీసీ రోడ్లు, రూ.7,550 కోట్లతో 9,500 కిలోమీటర్ల బీటీ రోడ్లు, రూ.300 కోట్లతో 22 వేల మినీ గోకులాలు, రూ.225 కోట్లతో 50 వేల ఎకరాల్లో ఉద్యాన తోటలకు మౌలిక సదుపాయాలు, రూ.110 కోట్లతో వెయ్యి కిలోమీటర్ల మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణ పనులు ఉన్నాయి. పల్లెల్లో ప్రతి ఇంటి ముందు సీసీ రోడ్లు, మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తూ గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నామని చంద్రబాబు తెలిపారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, పేదరికాన్ని తగ్గించడం, స్వచ్ఛతకు ప్రాధాన్యం ఇవ్వడం లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. పల్లె వికాసంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవ అభినందనీయమని, ఆయన నాయకత్వంలో మూడు పల్లె పండుగ కార్యక్రమాలను విజయవంతంగా - మిగతా 2లో



మోదీ రాజీనామా చేయాలి

- సీఈసీని వెంటనే తొలగించాలి: కాంగ్రెస్ డిమాండ్
- ఎన్నికల సంఘం పనితీరుపై కాంగ్రెస్ తీవ్ర ఆరోపణలు
- ఎస్ఐఆర్‌ను వెంటనే నిలిపివేయాలని సీడబ్ల్యూసీ డిమాండ్
- తొలగించిన 13.30 కోట్ల ఓటర్ల పేర్లను పునరుద్ధరించాలని కోరిన కాంగ్రెస్

6

సాంకేతికత, నైపుణ్యాలతోనే

దేశాభివృద్ధి సాధ్యం

- అమెరికాకు 100 ఏళ్లు పట్టింది, భారత్‌కు 20 ఏళ్లు చాలు
- విజయవాడలో జరిగిన మిషన్ కర్మయోగి వర్క్‌షాప్
- ఉద్యోగుల సామర్థ్య పెంపులో ఏపీకి జాతీయ స్థాయిలో తొలి ర్యాంక్
- విజేతలకు అవార్డులు అందజేసి ప్రసంగించిన సీఎం చంద్రబాబు



అమరావతి, మహానగర్

అభివృద్ధి చెందిన దేశంగా మారడానికి అమెరికాకు వందేళ్లు పడితే, ఆసియా దేశాలకు ఆరు నుంచి ఏడు దశాబ్దాలు పడితే, చైనాకు 45 ఏళ్లు పట్టిందని, కానీ నేటి భారత్‌కు ఆ లక్ష్యాన్ని చేరుకోవడానికి 20 ఏళ్లు చాలని ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు ధీమా వ్యక్తం చేశారు. సరైన నాయకత్వం, సాంకేతికత, అపారమైన యువశక్తితో ఈ అద్భుతాన్ని సాధించగల సత్తా భారత్‌కు ఉందని ఆయన స్పష్టం చేశారు. విజయవాడలోని అంబేద్కర్ కళావేదికలో మంగళవారం జరి గిన ‘మిషన్ కర్మయోగి’ వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఒడిశా, పుదుచ్చేరి రాష్ట్రాల ఉన్నతాధికారులు హాజరయ్యారు. ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యాన్ని పెంచడంలో (కెపాసిటీ - మిగతా 2లో

దేశవ్యాప్తంగా 16 ప్రాంతాల్లో ఎన్ఐఏ సోదాలు



- ఆరుగురు అరెస్ట్- కీలక పత్రాలు, ఫోన్లు స్వాధీనం
- ఆరుగురు అనుమానితులను అరెస్ట్ చేసినట్లు చెప్పిన జాతీయ దర్యాప్తు సంస్థ
- ల్యాప్‌టాప్, మొబైల్ ఫోన్లతో సహా అనేక పత్రాలు, ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడి

6

జగన్‌కు జేజేలు

- వైఎస్ జగన్‌ను చూసేందుకు భారీగా తరలి వచ్చిన జనం
- రోడ్డుకు ఇరువైపులా, మిద్దెలపై నుంచి జై జగన్ నినాదాలు
- చేయి కలపాలని, మాట్లాడాలని పరితపించిన యువత
- ఏబీఎం కాలేజీ నుంచి కాకుమాను రాజశేఖర్ ఇంటి వరకు దారిపొడవునా జనమే జనం
- కిలోమీటర్ దూరానికి అరగంటకు పైగా సమయం
- కాకుమాను రాజశేఖర్ కుటుంబానికి వైఎస్ జగన్ పరామర్శ



ఒంగోలు/అమరావతి, మహానగర్

వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అశేష జన వాహిని మధ్య మంగళవారం ఒంగోలులో పర్యటించారు. ఇటీవల మృతి చెందిన వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, లిడ్ క్యాప్ మాజీ చైర్మన్ కాకుమాను రాజశేఖర్ కుటుంబాన్ని పరామర్శించేందుకు వైఎస్ జగన్ ఒంగోలుకు వస్తున్నట్లు తెలుసుకుని భారీ సంఖ్యలో అభిమానులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా ఉదయం 10 గంటలకే ఏబీఎం కాలేజీ వద్దకు ముచ్చారు. కాలేజీ ప్రాంగణంతో పాటు ఆ ప్రాంతంలో రోడ్లన్నీ జనాలతో నిండిపోయాయి. తమ అభిమాన నేతను చూడగానే జనాలు కేరింతలు కొట్టారు. వైఎస్ జగన్ అభివాదం చేయగానే.. జై జగన్ నినాదాలతో హోరెత్తించారు. రోడ్లన్నీ జనాలతో కిక్కిరిసి పోవడంతో కాన్వాయ్ ముందుకు కదలడం కష్టంగా మారింది. భారీ జన సందోహం మధ్య తహసీల్దార్ కార్యాలయం, జాయ్ ఆస్పత్రి మీదుగా వైఎస్ జగన్.. కాకుమాను రాజశేఖర్ ఇంటికి చేరుకున్నారు. కాలేజీ నుంచి కిలోమీటర్ దూరంలో ఉన్న రాజశేఖర్ ఇంటి వద్దకు చేరుకునేందుకు అరగంటకు పైగా పట్టింది. మిద్దెలపైకెక్కి జగన్‌ను చూస్తూ సెల్ ఫోన్లతో ఫొటోలు తీసుకున్నారు. తిరుగు ప్రయాణంలో సైతం అంతే ఉత్సాహంతో యువత జేజేలు పలికారు. జై జగన్ నినాదాలు మిన్నంటాయి. జగన్‌ను చూసేందుకు ముహిుళలు - మిగతా 2లో

సామాన్యులకు తీపికబురు

- రైతుబజార్లలో రూ.35కే కిలో ఉల్లి
- ధరల స్థిరీకరణలో భాగంగా సబ్సిడీ ధరకు ఉల్లిపాయలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం
- ఉల్లి ధరల నియంత్రణపై ప్రభుత్వం దృష్టి
- మొదటి దశలో విజయవాడలో రేపటి నుంచి అమ్మకాలు



అమరావతి

మార్కెట్లో ఉల్లి ధరలు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సామాన్యులకు తీపికబురు అందించింది. ధరల స్థిరీకరణలో భాగంగా సబ్సిడీ ధరకు ఉల్లిపాయలను అందించేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. రైతు బజార్లలో కిలో ఉల్లిపాయలను కేవలం రూ. 35కే విక్రయించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. సబ్సిడీ ఉల్లి విక్రయాలను - మిగతా 2లో

ప్రతిభకు వేదికగా విజయవాడ ఉత్సవ్

- 46 విభాగాలు.. 100కు పైగా పోటీలు.. ఏడు టైటిల్స్
- డాన్స్ నుంచి మ్యూజిక్ వరకు.. చిత్రలేఖనం నుంచి కాలిగ్రఫీ వరకు
- అక్టోబర్ 8 నుంచి 12 వరకు తుమ్మలపల్లి కళాక్షేత్రంలో పోటీలు

విజయవాడ, మహానగర్

నగర ప్రజల్లోని కళా, సాంస్కృతిక ప్రతిభను వెలికితీసేందుకు విజయవాడ ఉత్సవ్ వేదికగా 46 విభాగాల్లో 100కు పైగా పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సొసైటీ ఫర్ వైబ్రంట్ విజయవాడ ఆధ్వర్యంలో, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పర్యాటక శాఖ సహకారంతో నిర్వహిస్తున్న విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా కేశినేని ఫౌండేషన్, జిజ్ఞాస ఆర్ట్‌వర్స్ ఆధ్వర్యంలో అక్టోబర్ 8 నుంచి 12 వరకు తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈ పోటీలు నిర్వహించనున్నారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరూ పాల్గొనేలా డాన్స్, మ్యూజిక్, చిత్రలేఖనం, కాలిగ్రఫీ, రంగోలి, వంటల తయారీ, ఫొటోగ్రఫీ, మేకింగ్ వంటి విభాగాల్లో పోటీలు నిర్వహించడంతో పాటు మిస్ విజయవాడ వంటి ప్రత్యేక పోటీలు కూడా ఉంటాయని



తెలిపారు. వయస్సు, ఆసక్తి, ప్రతిభకు అనుగుణంగా ప్రతి ఒక్కరికీ అవకాశం కల్పించేలా పోటీలను రూపొందించినట్లు పేర్కొన్నారు. నగరంలోని కళాకారులు, విద్యార్థులు, యువత, మహిళలు, చిన్నారులు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. విజయవాడ ఉత్సవ్‌ను ప్రతి ఒక్కరి ఉత్సవంగా నిర్వహించడమే లక్ష్యమని జిజ్ఞాస సంస్థ ప్రతినిధులు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజలందరినీ ఉత్సవంలో భాగస్వాములను చేసేలా కార్యక్రమాలను రూపొందిస్తున్నామని చెప్పారు. పోటీల్లో పాల్గొనాలనుకునే వారు విజయవాడ ఉత్సవ్, జిజ్ఞాస ఆర్ట్‌వర్స్ ఇన్‌స్టాగ్రామ్ పేజీల ద్వారా నమోదు చేసుకోవచ్చని, అక్టోబర్ 7 చివరి తేదీ అని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కాకు మల్లికార్జున్ యాదవ్, చెన్నుపాటి ఉషారాణి, ఎం.మానస, కే.మానస, బి.హరిత, డి.పావని, కే.కల్పన తదితరులు, విజయవాడ ఉత్సవ్, జిజ్ఞాస సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

పెండింగ్ విద్యుత్ పనులన్నీ పూర్తి చేస్తున్నాం

- ఈ ప్రాంత విద్యుత్ అవసరాలకు 220/132/33 కేవీ సబ్‌స్టేషన్ కీలకం
- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్
- పారిశ్రామిక అవసరాలన్నీ తీర్చేందుకు చర్యలు
- ఎంపీ కేశినేని చిన్ని

ఏ.కొండూరు, మహానగర్

నియోజకవర్గంలో విద్యుత్ మౌలిక వసతులను బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావులతో కలిసి మంగళవారం మండలంలో పర్యటించిన కృష్ణారావుపాలెంలోని బీసీ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసి, అనంతరం నూతనంగా నిర్మించిన 220/132/33 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని చిన్ని మాట్లాడుతూ సబ్‌స్టేషన్ అందుబాటులోకి రావడంతో తిరువూరు ప్రాంత ప్రజలు, రైతులు, పరిశ్రమలకు విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడుతుందని తెలిపారు. తిరువూరుతో పాటు మైలవరం ప్రాంత ప్రజలకు కూడా ప్రయోజనం కలుగుతుందన్నారు. మంత్రి గొట్టిపాటి రవి విద్యుత్ శాఖ బాధ్యతలు చేపట్టిన తర్వాత గతంలో పెండింగ్‌లో ఉన్న



సబ్‌స్టేషన్లు, ఇతర విద్యుత్ మౌలిక వసతుల పనులను వేగంగా పూర్తి చేస్తున్నారని పేర్కొన్నారు. తిరువూరు నియోజకవర్గ పారిశ్రామిక అభివృద్ధికి అవసరమైన విద్యుత్ మౌలిక వసతులను కల్పించి పరిశ్రమల అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. మంత్రి గొట్టిపాటి రవి మాట్లాడుతూ ఏ.కొండూరు, పరిసర గ్రామాల ప్రజలు, రైతులు, పరిశ్రమలకు విద్యుత్ ఇబ్బందులు లేకుండా సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 2020లో పనులు ప్రారంభమైనప్పటికీ పెండింగ్‌లో ఉన్న ఈ ప్రాజెక్టును కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తి చేసినట్లు చెప్పారు. విద్యుత్ టవర్ల నిర్మాణానికి సంబంధించి రైతుల సమస్యలను కూడా త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ట్రాన్స్‌కో సబ్‌స్టేషన్లు, విద్యుత్ లైన్లు, 33/11 కేవీ సబ్‌స్టేషన్లను బలోపేతం చేస్తూ రైతులు, పరిశ్రమలు, ప్రజలకు మెరుగైన విద్యుత్ అందించేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, విద్యుత్ శాఖ, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సాంకేతికత, నైపుణ్యాలతోనే దేశాభివృద్ధి సాధ్యం

-మొదటిపేజీ తరువాయి

బిల్డింగ్) దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ప్రథమ స్థానంలో నిలిచినందుకు గాను ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్, ఏపీఎస్‌డీపీఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అలపర్తి వెంకటేశ్వరరావులకు సీఎం చంద్రబాబు చేతుల మీదుగా అవార్డును ప్రదానం చేశారు. ఇదే విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచిన కర్ణాటక, తృతీయ స్థానంలో నిలిచిన ఒడిశా రాష్ట్రాల ప్రతినిధులకు కూడా ఆయన అవార్డులు అందజేశారు.

భవిష్యత్తు మనదే.. మార్పు అనివార్యం

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "భారత్ ఇప్పుడు ఒక నిర్ణయాత్మకమైన దశలో ఉంది. మనకు జ్ఞానం, సాంకేతికత, అపారమైన అవకాశాలు ఉన్నాయి. మన యువతలో అసాధారణమైన ఆకాంక్షలు ఉన్నాయి. ఈ ఆకాంక్షలను నెరవేర్చేందుకు మన పరిపాలనా వ్యవస్థలు సిద్ధంగా ఉన్నాయా? అన్నదే అసలైన ప్రశ్న. రాబోయే 20 ఏళ్లు దేశ భవిష్యత్తుకు అత్యంత కీలకం" అని విశ్లేషించారు. తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎన్నో మార్పులు చూశానని, ఒకప్పుడు కరెంట్, రోడ్లు, కనీసం ట్యాప్ వాటర్ కూడా లేని గ్రామం నుంచి తాను వచ్చానని గుర్తుచేసుకున్నారు. పదుల గ్రామాలకు కలిపి ఒకే ఒక్క టెలిఫోన్ ఉండేదని, అది కూడా పనిచేసేది కాదని నాటి పరిస్థితులను వివరించారు.

సాంకేతికతతో సుపరిపాలన

అలాంటి రోజుల నుంచి నేడు డిజిటల్ ఇండియా వరకు దేశం ఎంతో మారిందన్నారు. "గతంలో ఒక ఫైల్ ముందుకు కదలాలంటే ఎల్‌డీసీ నుంచి అదనపు కార్యదర్శి వరకు 15 నుంచి 20 స్థాయిలు దాటాల్సి వచ్చేది. కొన్నిసార్లు ఫైళ్లు కనపడక రోజుల తరబడి వెతకాల్సి వచ్చేది. కానీ ఈ-ఆఫీస్ విధానంతో ఇప్పుడు నిమిషాల్లో ఫైళ్లను క్లియర్ చేయగలుగుతున్నాం. నేను కూడా రోజుకు 15-20 నిమిషాల్లో ఫైళ్లను పూర్తి చేస్తున్నా" అని తెలిపారు. సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో అంగన్‌వాడీ టీచర్ కూడా తనకంటే మెరుగ్గా ఉన్నారని ప్రశంసించారు. రియల్ టైం గవర్నెన్స్, డేటా లేక్, కృత్రిమ మేధ (ూ×), డ్రోన్లు, సెన్సార్ల వాడకంతో పాలనను ప్రజలకు మరింత చేరువ చేస్తున్నామని, వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా చివరి వ్యక్తి వరకు ప్రభుత్వ సేవలను చేరవేయడమే లక్ష్యమని వివరించారు.



పిల్లి నల్లదా తెల్లదా అనేది ముఖ్యం కాదు.. ఎలుకను పట్టడమే ముఖ్యం!

ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన 'మిషన్ కర్మయోగి' ఒక అద్భుతమైన సంస్కరణ అని చంద్రబాబు కొనియాడారు. ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యాన్ని పెంచేందుకు ఇది ఎంతగానో దోహదపడుతోందన్నారు. ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా ఒక సెకండరీ గ్రేడ్ టీచర్ 4,200 కోర్సులు పూర్తి చేసి, జాతీయ స్థాయిలో 14,500 క్రెడిట్లు సాధించడం దీని విజయానికి నిదర్శనమన్నారు. చైనా ఆర్థిక సంస్కరణలను ప్రస్తావిస్తూ, "పిల్లి నల్లదా, తెల్లదా అన్నది ముఖ్యం కాదు, అది ఎలుకలను పడుతుందా లేదా అన్నదే ముఖ్యం" అనే డెంగ్ షియావోపింగ్ సూక్తిని గుర్తుచేశారు. ఫలితాలు రాబట్టడమే మన అంతిమ లక్ష్యం కావాలన్నారు.

స్వర్ణాంధ్ర ప్రదేశ్ లక్ష్యం

ఆంధ్రప్రదేశ్‌ను 'స్వర్ణాంధ్ర ప్రదేశ్ 2047'గా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని చంద్రబాబు పునరుద్ఘాటించారు. రాష్ట్ర జీఎస్‌డీపీ వృద్ధి రేటును 15 శాతానికి పైగా సాధించే సత్తా ఏపీకి ఉందన్నారు. "ఆంధ్రప్రదేశ్‌ను మిగతా రాష్ట్రాలకు ఒక పరిశోధన, అభివృద్ధి కేంద్రంగా ఒక ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్‌గా నిలబెడతాం. ఇక్కడ విజయవంతమైన నమూనాలను ఇతర రాష్ట్రాలు అనుసరించేలా చేస్తాం" అని ప్రకటించారు. సంక్షేమం, అభివృద్ధిని జోడించి సంపద సృష్టించి, ఆ ఫలాలను నిరుపేదలకు అందించడం ద్వారా అసమానతలను తగ్గించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. దేశంలోని నదుల అనుసంధానం పూర్తయితే భారత్‌ను ఎవరూ ఆపలేరని ఆయన అన్నారు. అంతిమంగా మనమంతా భారతీయులమని, పార్టీలు, ప్రాంతాలు వేరైనా దేశాన్ని ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో నిలపాలన్నదే అందరి లక్ష్యం కావాలని పిలుపునిచ్చారు.

పెత్తందార్లం కాదు.. ప్రజలకు సేవకులం

-మొదటిపేజీ తరువాయి

నిర్వహించామని చెప్పారు. పంచాయతీరాజ్ శాఖకు 13 జాతీయ అవార్డులు రావడం రాష్ట్రానికి గర్వకారణమన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పాలన సాగిస్తున్నామని, సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. తల్లికి వందనం, స్త్రీ శక్తి, సామాజిక పింఛన్లు, అన్నదాత సుఖీభవ వంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని చెప్పారు. వెలిగొండ ప్రాజెక్టు ఫేజ్-2 పనులను పూర్తి చేసి ఉదయగిరి ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని, సాగు, తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. రాష్ట్రంలో పరిశ్రమలను ఏర్పాటు చేసి ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు నెల్లూరు, ప్రకాశం జిల్లాలను రైలు, రోడ్డు కనెక్టివిటీతో లాజిస్టిక్స్ హబ్‌గా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఉదయగిరి సభలో పెద్దిరెడ్డిపల్లె రిజర్వాయర్ కాల్వ పనులకు రూ.52 కోట్లు, సోమశిల హైలెవల్ కెనాల్ ఫేజ్-1కు రూ.85 కోట్లు, కనిగిరిలోని 189 ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలకు తాగునీటి సౌకర్యం కోసం రూ.100 కోట్లు మంజూరు చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. డిఫెన్స్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌కు అవసరమైన అనుమతులు, సీబీజీ ప్లాంట్‌కు నిరంతర విద్యుత్, సోమశిల డ్యామ్ భద్రతకు అవసరమైన నిధులు సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం కాకొల్లువారిపల్లి గ్రామంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ శ్రమదానంలో పాల్గొని అభివృద్ధి పనులను పరిశీలించారు. గ్రామస్థులు వారికి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మంత్రులు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి, ఎన్ఎండీ ఫరూక్, నిమ్మల రామానాయుడు, బీసీ జనార్దన్‌రెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో పాటు నెల్లూరు, ప్రకాశం జిల్లాల ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

జగన్‌కు జేజేలు

-మొదటిపేజీ తరువాయి

సైతం భారీగా తరలి వచ్చారు. అభిమాన నాయకుడితో మాట్లాడాలని, కరచాలనం చేయాలుుని పెద్ద సంఖ్యలో యువత ఎగబడ్డారు. పోలీసులు ఎన్ని ఆంక్షలు పెట్టినా అభిమానులను ఆపటం వాళ్ల తరం కాలేదు. జగన్ పర్యటనలో అధిక సంఖ్యలో యువత తరలి రావడం కనిపించింది. వైఎస్ జగన్ ఒంగోలులో అడుగుపెట్టినప్పటి నుంచి తిరిగి వెళ్లే వరకు అడుగడుగునా అదే ఉత్సాహంతో జగన్‌ను అనుసరించారు. కాకుమాను ఇంటి వద్ద గుమిగూడిన యువకులు జగన్‌తో సెల్ఫీ దిగడానికి పోటీపడ్డారు. జగన్ అక్కడ ఉన్నంత సేపు 45 నిమిషాల పాటు ఆయన కోసం ఎదురు చూస్తూ జై జగన్ అంటూ నినాదాలు చేశారు.

ధైర్యంగా ఉండండి

డీఎస్సీ స్కామ్‌పై నిరసన వ్యక్తం చేస్తుండగా జరిగిన పోలీసుల తోపులాటలో గాయపడి, ఇటీవల మృతి చెందిన వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, లిడ్ క్యాప్ మాజీ చైర్మన్ కాకుమాను రాజశేఖర్ కుటుంబ సభ్యులను వైఎస్ జగన్ పరామర్శించారు. కాకుమాను మృతిపై తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. కాకుమాను రాజశేఖర్.. పార్టీకి అందించిన సేవలను వైఎస్ జగన్ గుర్తు చేసుకున్నారు. పార్టీ పట్ల నిబద్ధతతో, అంకిత భావంతో ఆయన పని చేశారన్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. రాజశేఖర్ కుటుంబం ఒంటరిది కాదని, వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

సామాన్యులకు తీపికబురు

-మొదటిపేజీ తరువాయి

తొలి దశలో విజయవాడ నగరంలో అమలు చేయనున్నారు. రేపటి నుంచి నగరంలోని అన్ని రైతుబజార్లలో ఈ విక్రయాలు ప్రారంభం కానున్నాయి. విజయవాడలోని ఏపీఐఐసీ రైతుబజార్‌లో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ పంపిణీ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

కొనుగోలుకు నిబంధనలు ఇవే

సబ్సిడీ ఉల్లిపాయలు కొనుగోలు చేసేందుకు వినియోగదారులకు ప్రభుత్వం నిబంధనలు విధించింది. ఉల్లి కోసం వచ్చే వారు తమ వెంట తప్పనిసరిగా ఆధార్ కార్డు లేదా రేషన్ కార్డు తీసుకురావాల్సి ఉంటుంది. ఈ కార్డుల ఆధారంగా ప్రతి కుటుంబానికి నెలకు గరిష్టంగా రెండు కిలోల ఉల్లిపాయలను మాత్రమే రూ. 35 చొప్పున విక్రయిస్తారు. బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టి, నిజమైన లబ్ధిదారులకు మాత్రమే ఈ ప్రయోజనం చేకూర్చేందుకే అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. బహిరంగ మార్కెట్లో అధిక ధర పలుకుతున్న బీపీటీ సూపర్ ఫైన్ రకం బియ్యాన్ని, ప్రత్యేక కౌంటర్లలో రూ.52-50 లకు ప్రత్యేక కౌంటర్ల ద్వారా పంపిణీ చేస్తున్నారు.

త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అమలు

ప్రస్తుతం విజయవాడకే పరిమితమైన ఈ సబ్సిడీ ఉల్లి పంపిణీని త్వరలో మిగతా ప్రాంతాలకు విస్తరించనున్నారు. ప్రజల నుంచి వచ్చే డిమాండ్‌ను బట్టి, దశలవారీగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని రైతు బజార్లలోనూ సబ్సిడీ ఉల్లిని అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. కూరగాయల మార్కెట్లో ఉల్లి ధరల భారాన్ని సామాన్యుడిపై పడకుండా చూడటమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్ తెలిపారు. ధరల స్థిరీకరణ నిధిని ఉపయోగించి పేద, మధ్యతరగతి ప్రజలకు ఉపశమనం కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కల్పిస్తున్న ఈ సబ్సిడీ ఉల్లి సదుపాయాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని మంత్రులు విజ్ఞప్తి చేశారు.

ఏపీ విద్యా సంస్కరణలకు సింగపూర్ ప్రశంసలు.. లోకేశ్‌కు షణ్ముగం కితాబు

ఏపీ విద్యాశాఖ మంత్రి లోకేశ్‌తో సింగపూర్ హోం మంత్రి షణ్ముగం భేటీ

రాష్ట్రంలో విద్యా సంస్కరణలను ప్రశంసించిన సింగపూర్ మంత్రి

మాదకద్రవ్యాల నియంత్రణ, విద్యారంగంలో ఏపీకి సహకారం అందిస్తామని హామీ

ఏపీ ఐటీఐలను సింగపూర్ ఐటీఈతో అనుసంధానించాలని నిర్ణయం

డ్రాపౌట్లను సున్నా శాతానికి తగ్గించాలని షణ్ముగం సూచన



ఆంధ్రప్రదేశ్ విద్యావ్యవస్థలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న వినూత్న సంస్కరణలను సింగపూర్ ప్రభుత్వం ప్రశంసించింది. రాష్ట్ర విద్యావ్యవస్థ బలోపేతానికి తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని సింగపూర్ హోం, న్యాయశాఖల మంత్రి కె. షణ్ముగం హామీ ఇచ్చారు. మంగళవారం తిరుమలలో ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌తో ఆయన భేటీ అయ్యారు. శ్రీవారి దర్శనం అనంతరం ఇరువురు నేతలు రాష్ట్ర అభివృద్ధి, విద్యా సంస్కరణలు, మాదకద్రవ్యాల నివారణ వంటి కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రంలో ప్రభుత్వం చేపడుతున్న వివిధ కార్యక్రమాలను, ముఖ్యంగా విద్యారంగంలో తీసుకువస్తున్న విప్లవాత్మక మార్పులను మంత్రి లోకేశ్ వివరించారు. ప్రభుత్వ పనితీరుతో పాటు విద్యకు ఇస్తున్న ప్రాధాన్యతను మంత్రి షణ్ముగం ఈ సందర్భంగా అభినందించారు. పాఠశాలల్లో డ్రాపౌట్ రేటును సున్నా శాతానికి తగ్గించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి షణ్ముగం సూచించారు. బడి మానేసే పిల్లలే భవిష్యత్తులో మాదకద్రవ్యాల బారిన పడే ప్రమాదం ఉందని ఆయన పేర్కొన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు సింగపూర్ తరహా కఠిన చట్టాలు అవసరమని అభిప్రాయపడుతూ, డ్రగ్స్ రహిత ఏపీ నిర్మాణానికి తమ సహకారం అందిస్తామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తున్న తీరును మంత్రి లోకేశ్ వివరించగా, ఏపీలోని ప్రభుత్వ పాఠశాలలను స్వయంగా సందర్శించేందుకు మంత్రి షణ్ముగం ఆసక్తి వ్యక్తం చేశారు. అలాగే, యువతకు ఉపాధి ఆధారిత నైపుణ్య శిక్షణ అందించే లక్ష్యంతో ఏపీలోని ఐటీఐలను సింగపూర్‌కు చెందిన 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్' (ఐటీఈ)తో అనుసంధానించేందుకు పరస్పరం సహకరించుకోవాలని ఇరువురు నేతలు నిర్ణయించారు.

అదరగొట్టిన లెవల్-1 జట్లు

ఉత్కంఠభరితంగా మూడో రోజు పోటీలు

ఆసక్తిదాయకంగా సబ్ జూనియర్ జాతీయ బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్





విజయవాడ స్పోర్ట్స్, మహానగర్

నగరంలో జరుగుతున్న సబ్ జూనియర్ జాతీయ బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో మూడో రోజు పోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి. బాలురు, బాలికల విభాగాల్లో లెవల్-1 జట్లు ఆధిపత్యం ప్రదర్శించాయి. బాలుర గ్రూప్-ఏలో ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ అజేయంగా కొనసాగుతుండగా, గ్రూప్-బిలో మహారాష్ట్ర అజేయ రికార్డును కొనసాగిస్తోంది. బాలికల గ్రూప్-ఏలో కర్ణాటక, తమిళనాడు, గ్రూప్-బిలో కేరళ, మహారాష్ట్ర ఓటమి లేకుండా కొనసాగుతున్నాయి. బాలికల విభాగంలో కర్ణాటక వరుసగా మూడో విజయాన్ని నమోదు చేసింది. ఉత్తరప్రదేశ్‌పై 58-49తో గెలిచిన కర్ణాటక తరపున భాన్య శ్రీ, దేవిషి ఝా చెరో 12 పాయింట్లు, ఆరుషి ఆనంద్ 10 పాయింట్లు సాధించారు. బాలుర గ్రూప్-ఏలో రాజస్థాన్ 84-68తో హర్యానాపై విజయం సాధించింది. రాజస్థాన్ తరపున హర్షవర్ధన్ ఎస్ 27, రాబిన్ ధంకా 17 పాయింట్లు సాధించారు. గ్రూప్-బిలో పంజాబ్ 61-54తో జార్ఖండ్‌ను ఓడించగా, మహారాష్ట్ర 75-45తో కర్ణాటకపై ఘన విజయం సాధించింది. మహారాష్ట్ర తరపున జియాన్ బానే 15, ఆర్నేష్ గంగూలీ 13, సల్మాన్ షేక్ 11 పాయింట్లు సాధించారు. బాలికల విభాగంలో పంజాబ్ 44-40తో తెలంగాణపై విజయం సాధించింది. పంజాబ్ తరపున సమ్రీన్ కౌర్ ధిండ్సా 16 పాయింట్లు సాధించగా, తెలంగాణ తరపున మిషా ఝువర్ 19 పాయింట్లతో రాణించింది. గ్రూప్-బిలో కేరళ 67-51తో ఒడిశాను ఓడించింది. కేరళ తరపున అన్నా జార్జ్ 23, అనన్య అనీష్ 17 పాయింట్లు సాధించారు. మహారాష్ట్ర 82-44తో మధ్యప్రదేశ్‌పై భారీ విజయాన్ని నమోదు చేయగా, నేత్రా దామ్కే 29 పాయింట్లతో మెరిశారు. ఆతిథ్య ఆంధ్రప్రదేశ్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. బాలికల జట్టు ఉత్తరాఖండ్‌పై 49-17తో ఘన విజయం సాధించగా, బాలుర జట్టు 21-107తో ఉత్తరప్రదేశ్ చేతిలో పరాజయం పాలైంది. లెవల్-2 పోటీల్లో ఛత్తీస్‌గఢ్ 92-18తో గోవాపై, తెలంగాణ 48-45తో తమిళనాడుపై, పశ్చిమ బెంగాల్ 62-41తో పుదుచ్చేరిపై విజయం సాధించాయి. బాలికల విభాగంలో రాజస్థాన్ 78-48తో చండీగఢ్‌ను, పుదుచ్చేరి 45-21తో జమ్మూ కశ్మీర్‌ను, జార్ఖండ్ 43-33తో బిహార్‌ను, మేఘాలయ 52-38తో మణిపూర్‌ను ఓడించాయి.

ఉదయం 6 గంటలకే బార్?

పెట్రోల్ బంక్ సమీపంలో బార్ నిర్వహణపై స్థానికుల అభ్యంతరం

అనుమతించిన సమయాలు, లైసెన్స్ నిబంధనలపై అధికారుల తనిఖీకి డిమాండ్



జగ్గయ్యపేట, మహానగర్

పట్టణంలోని మెయిన్‌రోడ్డులో పెట్రోల్ బంక్‌ను ఆనుకుని ఉన్న ఓ బార్‌లో ఉదయం 6 గంటలకే మద్యం విక్రయాలు ప్రారంభిస్తున్నారంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. మద్యం దుకాణాలు, బార్‌ల నిర్వహణకు ప్రభుత్వం నిర్దేశించిన సమయ నిబంధనలు అమలవుతున్నాయా లేదా అనే సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఉదయాన్నే బార్ కార్యకలాపాలు ప్రారంభమవుతున్నా సంబంధిత అధికారులు, పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. ప్రధాన రహదారిపై, పెట్రోల్ బంక్ సమీపంలో బార్ నిర్వహణ జరుగుతున్న నేపథ్యంలో ప్రజల భద్రతపై కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బార్‌కు అనుమతించిన సమయాలు, లైసెన్స్ నిబంధనలు, పరిసర ప్రాంతాల భద్రతా ప్రమాణాలను అధికారులు పరిశీలించాలని కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఎక్సైజ్, పోలీసు శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీ నిర్వహించి వాస్తవ పరిస్థితులను వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు. అయితే, బార్ యాజమాన్యం వైపు నుంచి ఈ ఆరోపణలపై వివరణ అందాల్సి ఉంది.

తెలంగాణ ప్రభుత్వ భాగస్వామ్యంతో కొండాపూర్‌లో అమెజాన్ ఆశ్రయ్ కేంద్రం



విజయవాడ:

తెలంగాణ ప్రభుత్వ భాగస్వామ్యంతో హైదరాబాద్ కొండాపూర్‌లో అమెజాన్ ఇండియా కొత్త ఆశ్రయ్ కేంద్రాన్ని ప్రారంభించింది. ఈ ఏడాది ప్రారంభంలో తెలంగాణ ప్రభుత్వంతో కుదిరిన అవగాహన ఒప్పందం మేరకు ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి అమెజాన్ ఆశ్రయ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం ఇదే తొలిసారి. దీంతో హైదరాబాద్‌లో అమెజాన్ నిర్వహిస్తున్న ఆశ్రయ్ కేంద్రాల సంఖ్య 10కి చేరింది. ఇ-కామర్స్, లాజిస్టిక్స్ రంగాల్లో పనిచేసే డెలివరీ డ్రైవర్ల కోసం ఏర్పాటు చేసిన ఈ కేంద్రాల్లో ఎయిర్ కండిషన్డ్ సీటింగ్, తాగునీరు, ఎలక్ట్రోలైట్స్, మొబైల్ ఫోన్ ఛార్జింగ్ పాయింట్లు, పరిశుభ్రమైన వాష్‌రూమ్‌లు, ప్రథమ చికిత్స కిట్లు, విశ్రాంతి సదుపాయాలు అందుబాటులో ఉంటాయి. అధిక రద్దీ ఉన్న ప్రాంతాల్లో మరో ఐదు ఆశ్రయ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. కొండాపూర్, భారతీనగర్, పటాన్‌చెరువు తదితర ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మిగిలిన నాలుగు కేంద్రాలను ఈ ఏడాది చివరి నాటికి ప్రారంభించాలని అమెజాన్ లక్ష్యంగా పెట్టుకుంది. కేంద్రాల ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ స్థలాల గుర్తింపు, అనుమతుల ప్రక్రియ, పరిపాలనా సమన్వయంలో సహకరిస్తున్నాయి. దేశవ్యాప్తంగా 17 నగరాల్లో 150కి పైగా ఆశ్రయ్ కేంద్రాలను అమెజాన్ నిర్వహిస్తోంది. కొత్త కేంద్రాన్ని సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జి. శ్రీజన, అమెజాన్ ప్రతినిధుల సమక్షంలో ప్రారంభించారు.

బెంగళూరులో యూజెనిక్స్ హెయిర్ సైన్సెస్



విశాఖపట్నం, మహానగర్

హెయిర్ రీస్టోరేషన్ రంగంలో యూజెనిక్స్ హెయిర్ సైన్సెస్ బెంగళూరులో నూతన అత్యాధునిక కేంద్రాన్ని ప్రారంభించింది. ఇందిరానగర్‌లోని ఫెదర్‌లైట్ వాంటేజ్, 100 ఫీట్ రోడ్‌లో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రారంభించారు. ఆరు శస్త్రచికిత్స గదులతో ఏర్పాటైన ఈ కేంద్రం దేశంలో యూజెనిక్స్‌కు ఐదో కేంద్రంగా సంస్థ తెలిపింది. బెంగళూరు, కర్ణాటక ప్రాంత ప్రజలకు ఆధునిక హెయిర్ రీస్టోరేషన్ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమని పేర్కొంది. ఈ సందర్భంగా సీఎం డీకే శివకుమార్ మాట్లాడుతూ బెంగళూరుకు యూజెనిక్స్ రావడం అభినందనీయమన్నారు. వైద్య నిపుణులు, వైద్య పర్యాటకాన్ని నగరానికి ఆకర్షించడంలో ఇటువంటి సంస్థల సేవలు ఉపయోగపడతాయని తెలిపారు. యూజెనిక్స్ సహ వ్యవస్థాపకులు డాక్టర్ ప్రదీప్ సేథి, డాక్టర్ అరికా బన్సల్ మాట్లాడుతూ ప్రతి రోగి అవసరాలకు అనుగుణంగా వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అందిస్తామని తెలిపారు. ప్రారంభోత్సవంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత సుదర్శన్ పట్నాయక్ రూపొందించిన ఇసుక శిల్పాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో మంత్రులు మహ్మద్ అజారుద్దీన్, డాక్టర్ అజయ్‌ధరం సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా.. వరల్డ్ హార్ట్ డే మారథాన్



విజయవాడ, మహానగర్

వరల్డ్ హార్ట్ డే సందర్భంగా మంగళవారం నలంద విద్యార్థులతో మారథాన్ కార్యక్రమాన్ని ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ఆసుపత్రి డైరెక్టర్, ప్రముఖ చీఫ్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ జె. శ్రీమన్నారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులతో కలిసి మారథాన్‌లో పాల్గొన్నారు. చిన్న వయస్సు నుంచే గుండె ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకోవాలని, ప్రతిరోజూ శారీరక వ్యాయామం చేయడంతో పాటు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పాటించాలని కార్యక్రమంలో సూచించారు. గుండె సంబంధిత వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ జె. శ్రీమన్నారాయణ మాట్లాడుతూ గుండె ఆరోగ్యం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. చిన్న వయస్సు నుంచే ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం ద్వారా భవిష్యత్తులో గుండె సంబంధిత సమస్యలను తగ్గించుకోవచ్చని తెలిపారు. కిలోమీటర్ మేర సాగిన మారథాన్‌లో నలందా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని 'హృదయాన్ని కాపాడుకుందాం--ఆరోగ్యంగా జీవిద్దాం', 'గుండె ఆరోగ్యం--మనందరి బాధ్యత' వంటి సందేశాలతో ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో ఆరోగ్యంపై చైతన్యం పెంపొందించడంతో పాటు సమాజంలో గుండె ఆరోగ్యంపై అవగాహనకు దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు. నలంద కళాశాల ప్రిన్సిపాల్ మాదల పద్మజ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

మెక్‌డొవెల్స్ నెం.1కు సరికొత్త రూపం

విజయవాడ



డయాజియో ఇండియా తన ప్రముఖ బ్రాండ్ మెక్‌డొవెల్స్ నెం.1ను కొత్త తరం వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా సరికొత్తగా పునరావిష్కరించినట్లు ప్రకటించింది. కేవలం ప్యాకేజింగ్‌లో మార్పులకే పరిమితం కాకుండా, అదనపు స్కాచ్‌తో మెరుగైన బ్లెండ్, ఆధునిక ప్రీమియం గుర్తింపును అందిస్తున్నట్లు సంస్థ తెలిపింది. సంప్రదాయ స్కాచ్ లక్షణాలను కొనసాగిస్తూనే కొత్త తరానికి అనుగుణంగా ఉత్పత్తిని ఆధునీకరించినట్లు పేర్కొంది. ఏటా 3 కోట్లకు పైగా కేసుల విక్రయాలతో మెక్‌డొవెల్స్ నెం.1 పరివర్తన భారతీయ విస్కీ విభాగంలో కీలక మార్పుగా సంస్థ అభివర్ణించింది. వినియోగదారుల ప్రాధాన్యతలు ధరకు మించి నాణ్యత, నైపుణ్యం, అనుభవం వైపు మారుతున్న నేపథ్యంలో ఈ మార్పులు చేపట్టినట్లు తెలిపింది. డయాజియో ఇండియా చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ రుచిరా జైట్లీ మాట్లాడుతూ.. నేటి విస్కీ వినియోగదారులు విలువకు కొత్త నిర్వచనం ఇస్తున్నారని, నాణ్యతతో పాటు సామాజిక సందర్భాల్లో తమ వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించే ఉత్పత్తులను కోరుకుంటున్నారని తెలిపారు. 11 మార్కెట్లలో 10 వేల మందికి పైగా వినియోగదారుల నుంచి సేకరించిన అంతర్దృష్టుల ఆధారంగా బ్రాండ్‌ను కొత్త తరానికి అనుగుణంగా అభివృద్ధి చేసినట్లు వెల్లడించారు.

గుండె ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు



విజయవాడ, మహానగర్

గుండె జబ్బులను నివారించేందుకు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడంతో పాటు ప్రమాద సంకేతాలను ముందుగానే గుర్తించి సకాలంలో వైద్యసేవలు పొందాలని కార్డియాలజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా--ఆంధ్రప్రదేశ్ చాప్టర్ సూచించింది. ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సూర్యారావుపేటలోని కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సొసైటీ ప్రతినిధి, ప్రముఖ కార్డియాలజిస్ట్ డా. ఎ. పూర్ణానంద్ మాట్లాడుతూ గుండెపోటు లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే అత్యవసర వైద్య సహాయం పొందాలని సూచించారు. ఛాతీలో నొప్పి లేదా ఒత్తిడి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అకారణంగా చెమటలు పట్టడం, గుండె దడ, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయరాదన్నారు. రక్తపోటు, మధుమేహం, కొలెస్ట్రాల్, శరీర బరువును క్రమం తప్పకుండా పరీక్షించుకోవాలని సొసైటీ ఏపీ అధ్యక్షులు డా. కె. గోపాలకృష్ణ సూచించారు. కూరగాయలు, పండ్లు, సంపూర్ణ ధాన్యాలతో కూడిన ఆహారం తీసుకోవడం, వ్యాయామం చేయడం, పొగాకు, ధూమపానానికి దూరంగా ఉండటం, తగినంత నిద్ర పొందడం అవసరమన్నారు. గుండె జబ్బులతో బాధపడుతున్న వారు వైద్యుల సూచన మేరకు మందులు వాడుతూ, నిరంతరం వైద్య పర్యవేక్షణలో ఉండాలని సొసైటీ ఏపీ అధ్యక్షురాలు డా. వి. వనజాక్షమ్మ తెలిపారు. గుండెపోటు చికిత్సలో ప్రతి నిమిషం కీలకమని, వీలైనంత త్వరగా చికిత్స అందితే గుండె కండరాన్ని కాపాడే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సమావేశంలో డా. శ్యామ్ ప్రసాద్, డా. చైతన్య తదితరులు పాల్గొని అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఉద్యోగులకు నాణ్యమైన నగదు రహిత వైద్యం అందించాలి

ఈహెచ్ఎస్ సేవలను బలోపేతం చేయాలి

ఏపీ ఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్

అమరావతి, మహానగర్



ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్ఎస్) ద్వారా నాణ్యమైన, నిరంతరాయమైన నగదు రహిత వైద్య సేవలు అందేలా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎ. విద్యాసాగర్ కోరారు. మంగళగిరిలోని ఆరోగ్యశ్రీ హెల్త్ ట్రస్ట్ కార్యాలయంలో ఈహెచ్ఎస్ సీఈవో పద్మావతి అధ్యక్షతన మంగళవారం జరిగిన ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశంలో విద్యాసాగర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.వి. రమణ పాల్గొన్నారు. నూతనంగా సీఈవోగా బాధ్యతలు స్వీకరించిన పద్మావతికి రాష్ట్ర కమిటీ తరపున శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగుల నుంచి వసూలు చేస్తున్న వాటాతో పాటు ప్రభుత్వ వాటాను నేరుగా ట్రస్ట్‌కు బదిలీ చేసేలా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు విద్యాసాగర్ తెలిపారు. ఈహెచ్ఎస్ ప్యాకేజీ రేట్లను సవరించడం, వార్షిక ఆరోగ్య పరీక్షలు ప్రారంభించడం, వైద్య బిల్లుల పరిష్కారంలో జాప్యాన్ని తగ్గించడం, ఈహెచ్ఎస్ ఆసుపత్రుల్లో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. విశ్రాంత సీపీఎస్ ఉద్యోగులకు కూడా ఈహెచ్ఎస్ సదుపాయం వర్తింపజేసి వారి కుటుంబాలకు మెరుగైన వైద్య భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగ సంఘాలు, ఆసుపత్రుల యాజమాన్యాలతో అక్టోబర్ రెండో వారంలో ఉమ్మడి సమావేశం నిర్వహిస్తామని సీఈవో పద్మావతి హామీ ఇచ్చారు. వైద్య పరిమితి సీలింగ్ పెంపు, ప్యాకేజీ రేట్ల సవరణ, డిజిటల్ హెల్త్ కార్డుల ద్వారా సమగ్ర వైద్య సేవలు, పూర్తి స్థాయి నగదు రహిత వైద్యానికి ఉద్యోగుల కంట్రిబ్యూషన్ తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో ఏపీ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్క వెంకటేశ్వర్లు, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి. హృదయ రాజు, పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. కృష్ణయ్య, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్, మహిళా విభాగం నాయకురాలు రాజ్యలక్ష్మి, విజయవాడ నగర శాఖ అధ్యక్షుడు సి.వి.ఆర్. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన దసరా ఏర్పాట్లు

లడ్డూ పోటు, అన్నదాన భవనాల పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలి

దుర్గ గుడి ఈవో శీనా నాయక్

విజయవాడ, మహానగర్



ఇంద్రకీలాద్రిపై జరగనున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవాల నేపథ్యంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి శీనా నాయక్ మంగళవారం సాయంత్రం క్షేత్రస్థాయిలో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. నూతన లడ్డూ పోటు, అన్నదాన భవనాలను తనిఖీ చేసిన ఈవో ఉత్సవాల నాటికి పెండింగ్‌లో ఉన్న చిన్నచిన్న పనులన్నింటినీ పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. భక్తులకు అందించే ప్రసాదాలు రుచికరంగా, నాణ్యతా ప్రమాణాలతో ఉండాలని, అన్నప్రసాద వితరణలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం కనకదుర్గ నగర్‌లో డ్రైనేజీ ఆధునీకరణ పనులను పరిశీలించి, పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దసరా ఉత్సవాలకు లక్షలాది మంది భక్తులు తరలిరానున్న నేపథ్యంలో క్యూలైన్లు, తాగునీరు, పారిశుద్ధ్యం, ప్రసాదాల పంపిణీ తదితర అన్ని విభాగాల్లో పటిష్ట ఏర్పాట్లు చేయాలని శీనా నాయక్ సూచించారు. నిర్దేశిత గడువులోగా పనులను పూర్తి చేసి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పర్యటనలో దేవస్థానం కార్యనిర్వాహక ఇంజినీర్, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలి

ఫారం-6ను యథాతథంగా అమలు చేయాలి

ఓటర్ల హక్కుల పరిరక్షణకు అక్టోబర్ 2న ప్రదర్శన

ఓటు పరిరక్షణ వేదిక జేఏసీ కో-కన్వీనర్ కొలనుకొండ శివాజీ

విజయవాడ, మహానగర్



ఓటర్ల హక్కులకు నష్టం కలిగించే విధంగా ఎన్నికల ప్రక్రియలో మార్పులు చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని ఓటు పరిరక్షణ వేదిక జేఏసీ కో-కన్వీనర్ కొలనుకొండ శివాజీ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'ఓట్ డీమన్‌స్ట్రేషన్' కారణంగా సగటు ఓటరుకు ఇబ్బందులు ఎదురయ్యాయని ఆరోపించారు. ఫారం-6 ద్వారా కొత్త ఓటరుగా నమోదు కావడంలో నిబంధనల కారణంగా ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, ముఖ్యంగా 18 ఏళ్ల నిండిన యువతీ యువకులకు నష్టం కలుగుతోందని పేర్కొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని, ఓట్ల చేర్పులు, తొలగింపులను క్షేత్రస్థాయి అధికారుల ద్వారా గతంలో మాదిరిగానే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రక్రియను కేంద్రీకృతం చేయకుండా వికేంద్రీకరించాలని కోరారు. ఫారం-6ను యథాతథంగా ఉపయోగించాలని ఎన్నికల సంఘాన్ని కోరారు. కాగా, ఎస్ఐఆర్, ఫారం-6పై ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చ కొనసాగుతోంది. ఎన్నికల సంఘం అధికారిక పోర్టల్‌లో ఫారం-6ను 18 ఏళ్ల నిండిన లేదా త్వరలో 18 ఏళ్లు నిండనున్న వారికి కొత్త ఓటరు నమోదుకు ఉపయోగించే దరఖాస్తుగా పేర్కొంది. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వై. వెంకటేశ్వరరావు, సీపీఐ నాయకుడు నక్కా వీరభద్రరావు, కళాబంధు గొల్ల నారాయణరావు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మీసాల రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అక్టోబర్ 2న సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించే ప్రదర్శనను విజయవంతం చేయాలని కొలనుకొండ శివాజీ పిలుపునిచ్చారు.

పల్లె పండుగలో క్యాటిల్ షెడ్లకు శంకుస్థాపన

ఆగిరిపల్లి, మహానగర్



మండలంలోని శోభనాపురం గ్రామంలో మంగళవారం పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా క్యాటిల్ షెడ్ నిర్మాణ పనులకు ఎంపీడీవో అబ్దుల్ సలాం కూటమి నాయకుల సమక్షంలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి మొత్తం 103 క్యాటిల్ షెడ్లు మంజూరయ్యాయని, ఒక్కో షెడ్ నిర్మాణానికి సుమారు రూ.2 లక్షలు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. శోభనాపురం, సింహాద్రి అప్పారావుపేట గ్రామాల్లో క్యాటిల్ షెడ్ల నిర్మాణానికి, బొదనపల్లి గ్రామంలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, కూటమి నాయకులు ఎన్. వేణు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జడ్పీహెచ్ఎస్ ఎస్ఎంసీ చైర్మన్‌గా లక్ష్మణరావు ఏకగ్రీవ ఎన్నిక

ఆగిరిపల్లి, మహానగర్

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యా కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు మంగళవారం నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం పి. పుష్పలత, మండల విద్యాభివృద్ధి అధికారి కె. ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో ఎస్. లక్ష్మణరావు చైర్మన్‌గా, బి. ప్రవంతి వైస్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎస్ఎంసీ సభ్యులుగా జే. బసవమ్మ, కె. శివకృష్ణ, ఎస్. ప్రశాంతి, టీ. నాగరాణి, డి. అరుణకుమారి, ఎస్. శివనాగరాజు, బి. సౌజన్య, కే. జ్యోతి, కే. ధనలక్ష్మి, ఎస్కే. గౌస్య, పి. శివకోటేశ్వరరావు, కే. నాగరాజు, ఎస్కే. షహీనా ఎన్నికయ్యారు. ఎన్నిక అనంతరం సభ్యులు తల్లిదండ్రుల ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ లక్ష్మణరావు మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధికి సమాజ భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు. పాఠశాల సీనియర్ ఉపాధ్యాయిని బీవీఎస్ లక్ష్మి, పూర్వ విద్యార్థి, దాత ఎండూరి శ్రీరామచంద్రమూర్తి, ఏఎన్ఎం పీఎస్ లత, ఆశా వర్కర్ కె. రమ, అంగన్‌వాడీ టీచర్ టీ. భవాని ఎస్ఎంసీ సభ్యులుగా వ్యవహరించనున్నారు. ఎస్ఎస్సీ మిషన్ మార్చి-27 ప్రభుత్వ పథకంలో భాగంగా పదో తరగతి విద్యార్థులకు ఉపయోగపడే స్ఫూర్తి స్టడీ మెటీరియల్‌ను ఎస్ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్, గ్రామ ప్రముఖుల చేతుల మీదుగా విద్యార్థులకు అందించారు.

ఎడిమాను ముందుగానే గుర్తించి వైద్యులను సంప్రదించాలి

విజయవాడ



శరీరంలోని కణజాలాల్లో అధికంగా ద్రవం చేరడం వల్ల ఎడిమా ఏర్పడుతుందని, సాధారణంగా పాదాలు, చీలమండలు, కాళ్లలో వాపు రూపంలో కనిపిస్తుందని వైద్య నిపుణులు తెలిపారు. గుండె, కాలేయం, మూత్రపిండాలు, థైరాయిడ్‌కు సంబంధించిన పలు అంతర్గత ఆరోగ్య పరిస్థితులతో ఎడిమా సంబంధం కలిగి ఉండవచ్చని పేర్కొన్నారు. ఎడిమాపై ప్రజల్లో అవగాహన పెంచడం, ముందస్తుగా గుర్తించడం, అవసరమైన వైద్య సహాయం పొందేలా ప్రోత్సహించడం లక్ష్యంగా ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 25న జాతీయ ఎడిమా డేను పాటించాలని ఇండియన్ ఎడిమా కన్సెన్సస్ సూచించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సిప్లా ఆధ్వర్యంలో 'సీ ఎడిమా, సీక్ హెల్ప్' కార్యక్రమం ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఆన్‌లైన్ ఎడిమా స్క్రీనింగ్ టూల్ ద్వారా ఎడిమా సంభావ్య సంకేతాలను గుర్తించి, వైద్య నిపుణులతో సమాచారంతో కూడిన చర్చకు సహాయపడే ప్రాథమిక స్కోర్‌ను పొందవచ్చని వివరించారు. విజయవాడకు చెందిన కార్డియాలజిస్ట్ డాక్టర్ కృష్ణ చంద్ కె మాట్లాడుతూ చిన్న రక్తనాళాల నుంచి ద్రవం లీకై చుట్టుపక్కల కణజాలాల్లో చేరడం వల్ల వాపు ఏర్పడుతుందన్నారు. తరచూ వచ్చే లేదా తగ్గకుండా కొనసాగే వాపును నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు. వాపుతో పాటు ఊపిరి అందకపోవడం, అసాధారణ గుండె లయ, ఛాతీలో నొప్పి వంటి లక్షణాలు ఉంటే తక్షణ వైద్య శ్రద్ధ అవసరమని తెలిపారు.

ఎన్‌బీసీ బేరింగ్స్ నుంచి కొత్త ఉత్పత్తులు

తిరుపతి, మహానగర్



నిర్మాణ, మైనింగ్, ఆఫ్-హైవే పరికరాల రంగంలో తమ ఉత్పత్తుల శ్రేణిని విస్తరిస్తూ నేషనల్ ఇంజినీరింగ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌కు చెందిన ఎన్‌బీసీ బెరింగ్స్ భౌమ కనెక్సపో ఇండియా 2026లో కొత్త ఉత్పత్తులను ఆవిష్కరించింది. సొల్యూషన్స్ ఇన్‌వొల్యూట్ పవర్‌గేర్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ అలోక్ గోయల్ ఈ ఉత్పత్తులను ఆవిష్కరించారు. అధిక లోడ్లు, నిరంతర వినియోగం, కఠినమైన పని పరిస్థితులను తట్టుకునేలా నిర్మాణ పరికరాల్లోని వివిధ అవసరాలకు అనుగుణంగా ఈ పోర్ట్‌ఫోలియోను అభివృద్ధి చేసినట్లు సంస్థ తెలిపింది. బేరింగ్ హౌసింగ్, ఇండక్షన్ హీటర్, బేరింగ్ పుల్లర్, ఫిట్టింగ్ టూల్స్, సింగిల్ పాయింట్ ఆటోమేటిక్ లూబ్రికేటర్ వంటి ఉత్పత్తులను ఇందులో అందుబాటులోకి తీసుకొచ్చింది. నిర్మాణ పరికరాల విభాగం తమకు కీలకమైన వృద్ధి అవకాశాలను అందిస్తోందని ఎన్‌బీఐఎల్ హెడ్--మార్కెటింగ్, ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్ సంజయ్ గుప్తా తెలిపారు. భారతదేశంలోనే ఇంజినీరింగ్, తయారీపై దృష్టి సారిస్తూ నాణ్యమైన సాంకేతిక పరిష్కారాలను అందిస్తున్నామని పేర్కొన్నారు. ఎగ్జిబిషన్‌లో కొత్త ఉత్పత్తులతో పాటు ఇతర సొల్యూషన్స్‌ను కూడా సంస్థ ప్రదర్శిస్తోంది.

ఎమ్మెల్యేకు సన్మానం

చల్లపల్లి, మహానగర్



నూతన తారురోడ్డు నిర్మాణంతో తమ గ్రామ రహదారి సమస్య పరిష్కారం కానుందని పీఏసీఎస్ చైర్మన్ పరుచూరి వెంకటేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని మంగళాపురం గ్రామానికి మూడు కిలోమీటర్ల నూతన తారు రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ సహకారంతో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రత్యేక శ్రద్ధతో పల్లె పండుగ-3.0 కార్యక్రమం పురస్కరించుకొని వీబీజీ-రాంజీ నిధులు రూ.కోటీ 45 లక్షలు మంజూరు చేసిన సందర్భంగా మంగళవారం అవనిగడ్డలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ను గ్రామ ప్రముఖులు, గ్రామస్థులు కలిసి ఘనంగా సత్కరించారు. తమ గ్రామ ప్రజలకు నూతన రహదారి మంజూరు చేయటం పట్ల పీఏసీఎస్ చైర్మన్ పరుచూరి వెంకటేశ్వరరావు ధన్యవాదములు తెలిపారు. కార్యక్రమంలో చంద్ర పిచ్చియ్య, కొర్రపాటి కోటేశ్వరరావు, చంద్ర వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ గొరిపర్తి వెంకటేశ్వరరావు, ముక్కు వెంకటేశ్వరరావు, కొల్లూరు శ్రీనివాసరావు, ఉప్పల బుజ్జి, డొక్కు నాగబాబు పాల్గొన్నారు.

సుజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గర్భిణీలకు ఉచిత వైద్య పరీక్షలు

విజయవాడ, మహానగర్

సుజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గర్భిణీల కోసం నిర్వహిస్తున్న ఉచిత మొబైల్ 2డీ ఎకో హెల్త్ స్క్రీనింగ్ క్యాంపులకు విశేష స్పందన లభిస్తోంది. మంగళవారం హెచ్‌బీ కాలనీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని స్థానిక గర్భిణీలు సద్వినియోగం చేసుకున్నారు. గర్భధారణ సమయంలో వచ్చే గుండె సంబంధిత సమస్యలను ముందుగానే గుర్తించి, ప్రాణాంతక పరిస్థితులను నివారించేందుకు ఈ పరీక్షలు ఉపయోగపడతాయని నిర్వాహకులు తెలిపారు. పేద, మధ్యతరగతి ప్రజలకు, ముఖ్యంగా గర్భిణీలకు ఎలాంటి ఖర్చు లేకుండా అత్యాధునిక వైద్య సేవలు అందించడమే సుజనా ఫౌండేషన్ లక్ష్యమని పేర్కొన్నారు. మధ్యాహ్నం వరకు కొనసాగిన శిబిరంలో 16 మంది గర్భిణీలకు 2డీ ఎకో, మాటర్నల్ కార్డియాక్ రిస్క్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ ఎన్. వంశీ, 2డీ ఎకో టెక్నీషియన్లు సుప్రియ, సింధుప్రియ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఆశా వర్కర్లు, సుజనా ఫౌండేషన్ సిబ్బంది, సుజన మిత్రా కోఆర్డినేటర్లు శిబిరంలో సేవలందించారు.

మలేరియా నియంత్రణలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు

- కేసులు పెరిగిన తర్వాత కాదు.. ముందే గుర్తించి అడ్డుకోవాలి
- గిరిజన, మారుమూల ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా
- ఒక్క మలేరియా మరణం కూడా సంభవించకూడదు
- ఆరోగ్య శాఖ కమిషనర్ చక్రధరబాబు



విజయవాడ, మహానగర్

రాష్ట్రంలో మలేరియా కేసుల నియంత్రణలో నిర్లక్ష్యం, అలసత్వం, జాప్యాన్ని ఎంతమాత్రం సహించేది లేదని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కె.వి.ఎన్. చక్రధరబాబు అధికారులను హెచ్చరించారు. కేసులు పెరిగిన తర్వాత స్పందించడం కాకుండా ముందుగానే గుర్తించి నియంత్రణ చర్యలు చేపట్టాలని, ఒక్క మలేరియా మరణం కూడా జరగకుండా అధికారులు, సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని ఆదేశించారు. 28 జిల్లాల అధికారులతో నగరంలో మంగళవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి కార్యశాలలో మలేరియా పరిస్థితి, వ్యాధుల నిఘా, దోమల నియంత్రణ, మందుల లభ్యత, సిబ్బంది పనితీరుపై సమీక్షించారు. ముఖ్యంగా గిరిజన, మారుమూల, అధిక ప్రమాద ప్రాంతాల్లో జ్వర కేసులపై ప్రత్యేక నిఘా ఉంచి, అవసరమైన పరీక్షలు నిర్వహించి, మలేరియా నిర్ధారణ అయితే వెంటనే చికిత్స అందించాలని సూచించారు. ఐహెచ్ఐపీ--ఐడీఎస్పీ, ఏవేర్, ఏడీఎస్ వ్యవస్థలను పూర్తిస్థాయిలో వినియోగించి కేసులు పెరిగే ప్రాంతాలను ముందుగానే గుర్తించాలని తెలిపారు. మలేరియా కేసులు నమోదైన ప్రాంతాల్లో దోమల నియంత్రణ చర్యలను తక్షణమే చేపట్టడంతో పాటు అవసరమైన మందుల నిల్వలను ముందుగానే సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది పనితీరును అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, కాగితాలపై నివేదికలకు కాకుండా క్షేత్రస్థాయిలో ఫలితాలు కనిపించాలని స్పష్టం చేశారు. మలేరియాతో పాటు కాలాజార్, ఫైలేరియా వ్యాధుల వివరాలను కూడా పక్కాగా నమోదు చేసి ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. సమావేశంలో ప్రజారోగ్య శాఖ అదనపు సంచాలకులు డాక్టర్ వెంకటరమణ, జాయింట్ డైరెక్టర్ అర్జునరావు, డిప్యూటీ డైరెక్టర్ వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

అట్టల ఫ్యాక్టరీని తనిఖీ చేసిన ఎంపీడీవో

కలుషిత నీటిపై రైతుల ఫిర్యాదుతో ఆకస్మిక తనిఖీ
ఫ్యాక్టరీ యాజమాన్యానికి నోటీసులు జారీ



ఆగిరిపల్లి, మహానగర్

మండలంలోని శోభనాపురం రోడ్డులో వడ్లమాను గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న అట్టల ఫ్యాక్టరీని ఎంపీడీవో అబ్దుల్ సలాం మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫ్యాక్టరీ నుంచి వెలువడుతున్న కలుషిత నీటి కారణంగా పంటలు, పశువులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని పలువురు రైతులు ఫిర్యాదు చేయడంతో ఆయన తనిఖీ నిర్వహించారు. అనంతరం ఫ్యాక్టరీ యాజమాన్యానికి నోటీసులు జారీ చేసినట్లు ఎంపీడీవో తెలిపారు. ఫ్యాక్టరీ నుంచి కలుషిత నీరు బయటకు రాకుండా చర్యలు చేపట్టి, ఇంకుడు గుంటలు ఏర్పాటు చేసుకుని పరిస్థితిని తమ దృష్టికి తీసుకువస్తామని యాజమాన్యం హామీ ఇచ్చిందన్నారు. తనిఖీలో పంచాయతీ కార్యదర్శి సునంద తదితరులు పాల్గొన్నారు.

నేడే పేదలకు పట్టాభిషేకం

- సాకారం కానున్న 24 వేలకు పైగా పేద కుటుంబాల దశాబ్దాల కల
- కార్యక్రమాన్ని ప్రారంభించనున్న ముఖ్యమంత్రి
- కార్యక్రమం విజయవంతానికి పకడ్బందీ ఏర్పాట్లు
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



విజయవాడ, మహానగర్

పేద కుటుంబాల దశాబ్దాల కలను సాకారం చేస్తూ అర్హులైన వారికి శాశ్వత చిరునామా, పూర్తి హక్కులతో చట్టబద్ధత కల్పించే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 30న పేదలకు పట్టాభిషేకం కార్యక్రమాన్ని పండగ వాతావరణంలో నిర్వహించనుందని.. ఈ కార్యక్రమం విజయవంతానికి అధికారులు పటిష్ట సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. మంగళవారం కలెక్టర్ లక్ష్మీశ.. జాయింట్ కలెక్టర్ ఇలక్కియతో కలిసి కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో పేదల పట్టాభిషేకం కార్యక్రమంపై సమన్వయ శాఖల అధికారులు, గ్యాలరీల ఇన్‌ఛార్జులు తదితరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విజయవాడ అజిత్ సింగ్‌నగర్‌లోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. వివిధ రకాల ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకొని ఎన్నో ఏళ్లుగా నివసిస్తున్న వారి ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణకు సంబంధించి ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం లబ్ధిదారులను గుర్తించినట్లు తెలిపారు. ఇందుకు క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులు గత రెండేళ్లుగా ఎంతో కృషిచేశారన్నారు. ఎన్‌టీఆర్ పట్టాలతో పాటు వివిధ అసైనీ పట్టాలు కలిగిన వారు, అభ్యంతరం లేని పోరంబోకు భూముల్లో వారసుల ఆక్రమణ/నివాసాలు, పీవోటీ ఉల్లంఘనలు ఇలా వివిధ కేటగిరీలకు సంబంధించి జిల్లాలో తొలిదశలో క్రమబద్ధీకరణకు 24 వేల మందికి పైగా లబ్ధిదారులను గుర్తించడం జరిగిందన్నారు. వీరికి ఆస్తిపై పూర్తి హక్కులు కల్పించేలా ప్రభుత్వం పత్రాలు అందించనుందని.. దీంతో దశాబ్దాలుగా తాము ఉంటున్న ఇళ్లపై ఉన్న అనిశ్చితి తొలగనుందని.. 616.56 ఎకరాల (దాదాపు 29,84,145 చదరపు గజాలు)కు పైగా భూమికి సంబంధించి ప్రైవేటు ఆస్తికి సమానంగా అన్ని హక్కులు కల్పించే పత్రాలు చేతికందనున్నాయన్నారు. వీటి ఎస్ఆర్ విలువ దాదాపు రూ. 9,800 కోట్లు కాగా మార్కెట్ విలువ రూ. 23 వేల కోట్లకు పైగా ఉంటుంది. అనంతరం కలెక్టర్ లక్ష్మీశ.. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు అధికారులతో కలిసి మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. దాదాపు 100 ప్రత్యేక కౌంటర్ల ద్వారా లబ్ధిదారులకు హక్కు పత్రాలు అందించేందుకు ఏర్పాట్లు చేశారు. వీరికి ప్రత్యేక ఇన్‌ఛార్జులను నియమించగా.. ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా సజావుగా కార్యక్రమం జరిగేలా దిశానిర్దేశం చేశారు. లబ్ధిదారులకు రవాణా సౌకర్యం, వేదిక వద్ద నిరంతర విద్యుత్ సరఫరా, వైద్య శిబిరాల ఏర్పాటు, సీటింగ్ అరేంజ్‌మెంట్, పబ్లిక్ అడ్రెసింగ్ సిస్టమ్ తదితరాలకు సంబంధించి సూచనలిచ్చారు. సమావేశంలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, ఆర్డీవో వెన్నెల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట బందోబస్తు



విజయవాడ, మహానగర్

ఈ నెల 30న ముఖ్యమంత్రి ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు అజిత్‌సింగ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మాకినేని బసవపున్నయ్య స్టేడియానికి రానున్న నేపథ్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశారు. నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర బాబు మంగళవారం ఇతర పోలీసు, సంబంధిత శాఖల అధికారులతో కలిసి స్టేడియం, పరిసర ప్రాంతాలు, పార్కింగ్ స్థలాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక సీసీ కెమెరాలు, ఏఐ ఆధారిత నిఘా వ్యవస్థలను వినియోగిస్తూ భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. బందోబస్తు కోసం ముగ్గురు ఎస్పీలు, ఒక ఏడీసీపీ, 17 మంది ఏసీపీలు, 37 మంది ఇన్‌స్పెక్టర్లతో పాటు మొత్తం 1,076 మంది పోలీసు అధికారులు, సిబ్బందిని నియమించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీపీ జి. రామకృష్ణ, ఏసీపీలు, ఇతర శాఖల అధికారులు, ఇన్‌స్పెక్టర్లు, కార్యక్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

అక్టోబర్ 2న 'స్వచ్ఛతాన్' మారథాన్

- పరిశుభ్రతపై ప్రజల్లో చైతన్యమే లక్ష్యం
- 10 వేల మందితో భారీ పరుగుకు సన్నాహాలు
- రూ.10 లక్షల నగదు బహుమతులు
- స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి రామ్



విజయవాడ, మహానగర్

మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని అక్టోబర్ 2న విజయవాడ--అమరావతి ప్రాంతంలో 'స్వచ్ఛతాన్' మారథాన్ నిర్వహిస్తున్నట్లు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి రామ్ తెలిపారు. నగరంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మారథాన్ వివరాలను వెల్లడించారు. పరిశుభ్రత, పారిశుధ్యం, ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా 'స్వచ్ఛతాన్' నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత ఏడాది నిర్వహించిన తొలి ఎడిషన్‌లో 6 వేల నుంచి 7 వేల మంది రన్నర్లు పాల్గొన్నారని, ఈ ఏడాది రెండో ఎడిషన్‌లో సుమారు 10 వేల మంది పాల్గొంటారని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. 5కె, 10కె, 21కె హాఫ్ మారథాన్ విభాగాల్లో పరుగులు నిర్వహించి, విజేతలకు మొత్తం రూ.10 లక్షల నగదు బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 2న ఉదయం 5 గంటలకు విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి మారథాన్ ప్రారంభమవుతుందని, మంత్రి నారా లోకేష్ ఫ్లాగ్‌ఆఫ్ చేయనున్నారని చెప్పారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులతో పాటు సినీ, క్రీడా రంగ ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. స్టేడియం నుంచి పోలీస్ కంట్రోల్ రూమ్, వినాయకుడి గుడి, సీతమ్మవారి పాదాలు, కృష్ణా బ్యారేజ్, స్టీల్ బ్రిడ్జి మీదుగా అమరావతి రాజధాని ప్రాంతంలోని మంతెన సత్యనారాయణ రాజు ఆశ్రమం వరకు మారథాన్ కొనసాగుతుందని పేర్కొన్నారు. రన్నర్ల కోసం డ్రమ్మర్లు, కళాబృందాల ప్రదర్శనలు, జుంబా తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. విజయవాడ పోలీస్ కమిషనరేట్, మున్సిపల్ కమిషనర్, జిల్లా కలెక్టర్ సమన్వయంతో భద్రత, రూట్ క్లియరెన్స్ ఏర్పాట్లు చేస్తున్నారని చెప్పారు. రిజిస్ట్రేషన్ తప్పనిసరి కాగా, రిజిస్ట్రేషన్ చేసుకోని వారికి కూడా 5కె రన్‌లో పాల్గొనే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. రాబోయే దసరా ఉత్సవాలకు 'స్వచ్ఛతాన్' మారథాన్ కర్టెన్ రైజర్‌గా నిలుస్తుందని పట్టాభి రామ్ పేర్కొన్నారు. సమావేశంలో అమరావతి రన్నర్స్ ప్రతినిధి రావి రమేష్, హెచ్‌డీఎఫ్‌సీ ప్రతినిధి పవన్, మెడ్‌స్టార్ హాస్పిటల్స్ ప్రతినిధి ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ ఉత్సవ్‌ను విజయవంతం చేద్దాం

- పారిశ్రామిక, వాణిజ్య వర్గాల సహకారం అవసరం
- ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)



విజయవాడ, మహానగర్

అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న విజయవాడ ఉత్సవ్‌ను విజయవంతం చేసేందుకు పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, వాణిజ్య సంఘాల ప్రతినిధుల సహకారం అవసరమని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. విజయవాడ ఉత్సవ్ నిర్వహణపై గాంధీనగర్‌లోని చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో ప్రతినిధులతో మంగళవరాం ఆయన సమావేశమై ఉత్సవ్ నిర్వహణ, ప్రజల భాగస్వామ్యం, పారిశ్రామిక, వాణిజ్య రంగాల సహకారంపై చర్చించారు. విజయవాడ ఉత్సవ్‌లో నగర ప్రజలతో పాటు పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, వివిధ వాణిజ్య సంఘాలు, అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. విజయవాడ నగరం పారిశ్రామికంగా, ఆర్థికంగా, వాణిజ్యపరంగా మరింత అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం ప్రభుత్వంతో పాటు పారిశ్రామిక, వాణిజ్య రంగాలు భాగస్వాములు కావాలని అన్నారు. పెట్టుబడులు, పరిశ్రమలు, వ్యాపార కార్యకలాపాలు పెరిగేలా అనుకూల వాతావరణాన్ని బలోపేతం చేయాలని పేర్కొన్నారు. విజయవాడకు ఉన్న చారిత్రక, సాంస్కృతిక, వాణిజ్య ప్రాధాన్యతను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు నగర అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఉత్సవ్ విజయవంతానికి తమ వంతు సహకారం అందిస్తామని చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు తెలిపారు. సమావేశంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ గడ్డం బాల వెంకట రవికుమార్, సెక్రటరీ వక్కలగడ్డ శ్రీకాంత్, వి.వి.కె. నరసింహారావు, తమ్మన శ్రీనివాస్, దామోదర్ రావు, బాలకిషన్ లోయ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లా యువజనోత్సవాలు

- కళా ప్రతిభను చాటిన 300 మంది యువతీ యువకులు
- రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా విజేతల ఎంపిక





విజయవాడ, మహానగర్

యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువజనోత్సవాలు--2026ను నగరంలోని నలంద డిగ్రీ కళాశాలలో మంగళవారం ఉత్సాహభరితంగా నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 300 మంది యువతీ యువకులు పాల్గొని తమ కళా నైపుణ్యాలను ప్రదర్శించారు. ఫోక్ డాన్స్ గ్రూప్, నుక్కడ్ నాటక్ (వీధి నాటకం), పెయింటింగ్, కవితా రచన తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించగా యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని యువజన సర్వీసుల శాఖ కమిషనర్ ఎస్. భరణి ప్రారంభించారు. యువతలోని సృజనాత్మకత, కళా ప్రతిభను వెలికితీసేందుకు యువజనోత్సవాలు చక్కని వేదికగా నిలుస్తాయని ఆమె అన్నారు. రాష్ట్ర యువత జాతీయ స్థాయిలో ప్రతిభను ప్రదర్శించి మంచి ఫలితాలు, బహుమతులు సాధించాలని ఆకాంక్షించారు. వివిధ విభాగాల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. జిల్లా స్థాయి పోటీల్లో విజయం సాధించిన యువతీ యువకులు నవంబర్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి యువజనోత్సవాల్లో పాల్గొంటారని అధికారులు తెలిపారు.

మోదీ రాజీనామా చేయాలి

ఎన్నికల సంఘం పనితీరు, ఓటర్ల జాబితాలో మార్పులపై కాంగ్రెస్ తీవ్రస్థాయిలో మండిపడింది. ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఎన్నికల వ్యవస్థలో జరుగుతున్న పరిణామాలపై ప్రధానికి పూర్తి సమాచారం ఉందని, ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోవాల్సిన బాధ్యత ఆయనపై ఉందని అన్నారు. ప్రధాని పదవిలో కొనసాగేందుకు మోదీకి నైతిక హక్కు లేదని వ్యాఖ్యానించారు. మంగళవారం కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం జరిగింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్, ప్రియాంక గాంధీ వాద్రా తదితరులు హాజరయ్యారు. దాదాపు రెండున్నర గంటల పాటు జరిగిన సమావేశంలో ఎన్నికల సంఘం, ఓటర్ల జాబితా, ఎస్ఐఆర్‌పై ప్రధానంగా చర్చించారు. మొత్తం 68 మంది సభ్యులు సమావేశంలో పాల్గొన్నారు.

'సీఈసీని తొలగించాలి'

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను వెంటనే తొలగించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. సీఈసీకి ఇకపై నైతిక, సంస్థాగత అధికారం లేదని సీడబ్ల్యూసీ తీర్మానంలో పేర్కొంది. ఎస్ఐఆర్‌ను వెంటనే నిలిపివేయాలని కూడా కోరింది. ఎస్ఐఆర్ ద్వారా ఓటర్ల జాబితాలో పెద్ద సంఖ్యలో పేర్లు తొలగించారని కాంగ్రెస్ ఆరోపించింది. తొలగించినట్లు చెబుతున్న 13 కోట్ల 30 లక్షల మంది ఓటర్ల పేర్లను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేసింది. ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని కోరింది.

'మ్యాచ్ ఫిక్సింగ్ ఎన్నికలు'

ఎన్నికల సంఘం, ప్రధాని-హోంమంత్రి వ్యవస్థ మధ్య మ్యాచ్‌ఫిక్సింగ్ జరుగుతోందని జైరాం రమేశ్ ఆరోపించారు. దేశంలో ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా జరగడం లేదని అన్నారు. ఎన్నికలపై రాహుల్ గాంధీ గతంలో లేవనెత్తిన అంశాలు ఇప్పుడు మరింత ప్రాధాన్యం సంతరించుకున్నాయని చెప్పారు. హరియాణా, కర్ణాటక, మహారాష్ట్ర ఎన్నికలకు సంబంధించి రాహుల్ గాంధీ గతంలో పలు ప్రశ్నలు



లేవనెత్తారని జైరాం రమేశ్ తెలిపారు. గత 18-19 నెలలుగా ఎన్నికల వ్యవస్థకు సంబంధించిన అంశాలపై రాహుల్ గాంధీ ఆధారాలను ప్రజల ముందు ఉంచుతున్నారని చెప్పారు.

ఎన్నికల సంఘంలోని ఇద్దరు కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి ఎస్ఐఆర్‌కు సంబంధించిన నిర్ణయాలు, ఆదేశాలపై గత పది నెలల్లో పలుమార్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు ఓ మీడియా కథనం పేర్కొంది. ఈ అంశాన్ని కూడా కాంగ్రెస్ సీడబ్ల్యూసీ సమావేశంలో చర్చించింది. ఇద్దరు ఎన్నికల కమిషనర్లు క్యాబినెట్ కార్యదర్శికి తమ అభిప్రాయాలను తెలియజేశారని కేసీ వేణుగోపాల్ అన్నారు. ఈ విషయం ప్రధాని దృష్టికి కూడా వెళ్లిందని చెప్పారు.

ఎన్నికల సంఘం అంతర్గత వ్యవహారాలపై ప్రధానికి సమాచారం ఉన్నందున, ఈ విషయంలో ఆయన జోక్యం చేసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. జ్ఞానేశ్ కుమార్ చర్యలు ప్రధాని నరేంద్ర మోదీ సమ్మతి లేకుండా జరిగే అవకాశం లేదని ఆరోపించారు. అయితే ఎన్నికల సంఘం మాత్రం తమ నిర్ణయాలన్నీ చట్టపరమైన ప్రక్రియ ప్రకారమే జరుగుతున్నాయని చెబుతోంది. ఒక సంస్థలో నిర్ణయాలు తీసుకునే సమయంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావడం సాధారణమేనని స్పష్టం చేసింది. ఎస్ఐఆర్‌కు సంబంధించిన నిర్ణయాలకు చట్టపరమైన ఆధారం ఉందని పేర్కొంది.

దేశవ్యాప్తంగా నిరసనలు

ఎన్నికల వ్యవస్థలో జరుగుతున్న పరిణామాలపై కాంగ్రెస్ ఇకపై దేశవ్యాప్తంగా ఉద్యమించాలని నిర్ణయించింది. పార్లమెంట్‌లో, కోర్టుల్లో, ప్రజాక్షేత్రంలో పోరాటం కొనసాగిస్తామని సీడబ్ల్యూసీ తీర్మానంలో పేర్కొంది. శాంతియుతంగా, కానీ తీవ్ర స్థాయిలో దేశవ్యాప్తంగా నిరసనలు చేపడతామని కేసీ వేణుగోపాల్ ప్రకటించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందని చెప్పారు. ఎన్నికల వ్యవస్థలో జరుగుతున్న పరిణామాలపై బుధవారం కాంగ్రెస్‌తో పాటు ఇతర ప్రతిపక్ష పార్టీలు సమావేశం కానున్నాయి. ఆ సమావేశంలో తదుపరి కార్యాచరణపై ఉమ్మడి నిర్ణయం తీసుకోనున్నట్లు కాంగ్రెస్ తెలిపింది.

దేశవ్యాప్తంగా 16 ప్రాంతాల్లో ఎన్ఐఏ సోదాలు

అసోం, బంగాల్, కేరళ రాష్ట్రాల్లోని 16 ప్రాంతాల్లో జాతీయ దర్యాప్తు సంస్థ మంగళవారం సోదాలు చేపట్టింది. 'జమాత్-ఉల్-ముజాహిదీన్ బంగ్లాదేశ్' (జేవీబీ)కు అనుబంధంగా ఉన్న 'ఇమామ్ మహ్మదర్ కఫిలా' కు సంబంధించిన ఉగ్రవాద కుట్ర, అసోంలో యువతను తీవ్రవాద భావజాలం వైపు మళ్లింపుపై ఈ సోదాలు నిర్వహించింది. మొత్తం 16 ప్రాంతాల్లో 10 అసోంలో, 5 బంగాల్‌లో ఒకటి కేరళలో ఉన్నాయి. విచారణ కోసం అసోంలోని బార్పేట జిల్లాకు చెందిన ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు తెలిపింది. అరెస్టు అయిన వారి వద్ద నుంచి ల్యాప్‌టాప్, మొబైల్ ఫోన్లతో సహా అనేక పత్రాలు, ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఐఎంకే పన్నిన ఉగ్రవాద కుట్రకు సంబంధించి 11 మంది నిందితులపై ఎన్ఐఏ అభియోగాలు నమోదు చేసిన మూడు నెలల తర్వాత సోదాలు నిర్వహించింది. అసోంలోని బార్‌పేట జిల్లాలో, ఆజాద్ నగర్ నిచుకా ప్రాంతాల్లోని పలు చోట్ల ఎన్ఐఏ సోదాలు నిర్వహించింది. విచారణ కోసం అస్సాంలోని బార్పేట జిల్లాకు చెందిన ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు తెలిపింది. అరెస్టు అయిన వారిని సోర్బోగ్‌కు చెందిన ఫరూక్ అబ్దుల్లా, జాకీర్ హుస్సేన్, చాంద్‌బార్ అలీ, బార్పేట రోడ్‌కు చెందిన ముస్తఫిజుర్ రెహమాన్, నిషుకాకు చెందిన యాకూబ్ అలీ, హౌలీలోని జషిహతిపరా గ్రామానికి చెందిన రకీబుల్ ఇస్లాంలుగా గుర్తించారు. ఈ ఆపరేషన్ సమయంలో అనేక కీలకమైన పత్రాలను కూడా స్వాధీనం చేసుకున్నారు.

మరోవైపు బంగాల్‌లోని దక్షిణ దినాజ్‌పుర్ జిల్లా కుష్మారి ముందేహర్ గ్రామానికి చెందిన ముజిబుర్ రెహమాన్ (26) ఇంటిపై 'జమాత్-ఉల్-ముజాహిదీన్' ఉగ్రవాద సంస్థతో సంబంధాలు ఉన్నాయన్న అనుమానంతో దర్యాప్తు అధికారులు సోదాలు నిర్వహించారు. ముజిబుర్ ఇంటికి దూరంగా ఉండి చదువుకుంటుండగా, జనవరిలో పోలీసులు తమ ఇంటికి వచ్చి అతడి ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారని అతడి తండ్రి మిజానూర్ రెహమాన్ చెప్పారు. అప్పటి నుంచి ముజిబుర్ పరారీలో ఉన్నాడు. ప్రస్తుతం అతడి ఆచూకీ గానీ,



కార్యకలాపాల గురించి గానీ ఎవరికీ తెలియదు. ఎన్ఐఏ వర్గాల సమాచారం ప్రకారం, ముజిబుర్‌కు ఉగ్రవాద కార్యకలాపాలతో సంబంధాలు ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే, నిందితుడి కుటుంబ సభ్యులు, స్థానికులు మాత్రం, అతడు తన ఉన్నత చదువులతో పాటు ఖురాజ పరీక్షకు కూడా సన్నద్ధమవుతున్నాడని అంటున్నారు. గత జనవరి వరకు అతడు ఇంట్లోనే ఉన్నప్పటికీ, ఆ తర్వాత అతడి ఆచూకీ లేకుండా పోయింది. సుమారు ఏడు లేదా ఎనిమిది నెలల క్రితం పోలీసులు అతడి నివాసంలో సోదాలు నిర్వహించినట్లు స్థానిక వర్గాలు తెలిపాయి. బంగాల్, అసోం, త్రిపురతో సహా ఈశాన్య రాష్ట్రాల్లో ఉగ్రవాద భావజాలాన్ని విస్తరించేందుకు ఐఎంకే పన్నిన కుట్రలో నిందితులు చురుకుగా పాల్గొన్నట్లు ఎన్ఐఏ దర్యాప్తులో తేలింది. ఈ కుట్రలో ఉగ్రవాద సంస్థ ఎజెండాను ప్రచారం చేయడం, సులభంగా ప్రభావితమయ్యే యువతను తీవ్రవాదం వైపు మళ్లించడం, భారతదేశంలో ఆ సంస్థ నెట్‌వర్క్‌ను విస్తరించడం లక్ష్యంగా పెట్టుకుంది. గువాహటిలోని ఎన్ఐఏ ప్రత్యేక కోర్టులో దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌లో నిందితులపై 'భారతీయ న్యాయ సంహిత-2023', చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం-1967'లోని వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. భారత్‌లో నిషేధిత సంస్థ జీడీవీ దుర్మార్గపు ఎజెండాను ముందుకు తీసుకెళ్లడానికి, ఆ సంస్థకు చెందిన సీనియర్ సభ్యుడు ఇమామ్ మహమూద్ హబీబుల్లా 'ఐఎంకే ని స్థాపించినట్లు ఎన్ఐఏ దర్యాప్తులో తేలింది. రహస్య సమావేశాలు, మతపరమైన భావజాల ప్రచారం, తీవ్రవాద సాహిత్యాన్ని పంపిణీ, ఐఎంకే/జెఎంబి నాయకత్వానికి మద్దతుగా భారత్‌కు వ్యతిరేకంగా డిజిటల్ వేదికల ద్వారా ప్రచారం చేస్తున్నారు. ఈ మార్గాల ద్వారా భారతదేశంలో ఐఎంకే/జెఎంబి ఉనికిని విస్తరించడానికి ఈ 11 మంది నిందితులు కుట్ర పన్నినట్లు ఎన్ఐఏ అధికారులు గుర్తించారు.

భారత్- చైనా మధ్య సంబంధాలు గతంతో పోలిస్తే మెరుగ్గా ఉన్నాయి

భారత్- చైనా మధ్య సంబంధాలు గతంతో పోలిస్తే నేడు మెరుగ్గా ఉన్నాయని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అభిప్రాయపడ్డారు. సరిహద్దు సమస్యలు పరిష్కారం కావడంతో ఇరు దేశాల సంబంధాలు సాధారణ స్థితికి చేరుకుంటున్నాయని అన్నారు. సోమవారం న్యూయార్క్‌లో 'ఆసియా సొసైటీ'లో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న జైశంకర్ ఈ మేరకు స్పందించారు. "గతంతో పోలిస్తే ప్రస్తుతం సంబంధాలు మెరుగ్గా ఉన్నాయా అని నన్ను అడిగితే, 'అవును' అని అంటాను. 2024తో పోలిస్తే అవి మరింత మెరుగ్గా ఉన్నాయి." అన్నారు. 2020లో భారత్-చైనా మధ్య సరిహద్దు ఉద్రిక్తతలు తలెత్తిన తర్వాత రెండు దేశాల మధ్య సాధారణ సంబంధాలు నిలిచిపోయాయని జైశంకర్ చెప్పారు. వాణిజ్యం కొనసాగినప్పటికీ, అధికారిక రాకపోకలు, వీసా జారీ, విమాన సర్వీసులు మాత్రం ప్రభావితమయ్యాయని వివరించారు. ఈ క్రమంలోనే సరిహద్దు ఉద్రిక్తతలు పరిష్కారం కాగానే, సంబంధాలు మెరుగుపడటం సహజమని అన్నారు.

"మేము ఒక అత్యంత ప్రాథమిక సూత్రానికి వచ్చాం. సరిహద్దు పరిస్థితే మన సంబంధాల స్థితిని నిర్ణయిస్తుంది. సరిహద్దులో ఉద్రిక్తతలు కొనసాగుతుండగా, సంబంధాలు మాత్రం సాధారణంగా ఉండాలని ఆశించడం సాధ్యం కాదు. సరిహద్దు పరిస్థితి సాధారణ స్థితికి చేరుకుంటున్న కొద్దీ, మన సంబంధాలు కూడా సాధారణ స్థితికి వస్తాయి. సంబంధాలు సాధారణ స్థితికి రావడం వల్ల మన ఇద్దరికీ ప్రయోజనం



చేకూరుతుంది. ఒక నిర్దిష్ట సమస్యపై మాత్రమే పూర్తిగా దృష్టి సారించి, తద్వారా నష్టపోయే పరిస్థితిని నేను కోరుకోను. నాకు అనుకూలమైన పరిష్కారం దొరికితే, దానినే ఎంచుకోవడానికి నేను ప్రాధాన్యం ఇస్తాను"

"మన మధ్య సంబంధాల్లో ప్రతిష్టంభన లేదా క్షీణత అనేది వాస్తవానికి మనలో ఎవరికీ ప్రయోజనం చేకూర్చదు. పైగా దీనివల్ల మూడో పక్షాలే లాభపడతాయి. ఇదే విషయాన్ని భారత్? చాలా కాలంగా చైనాకు చెబుతోంది. అలాగే, 'ఇతరులకు ప్రయోజనం చేకూర్చే సమస్యలో మనం చిక్కుకుపోకూడదు' అనే అత్యంత ప్రాథమిక దౌత్య సూత్రాన్ని కూడా మేము నిలకడగా పాటించాం. ఏ కారణం చేతనో, చైనా పక్షం దీనిని అంగీకరించడానికి కొంత సమయం పట్టింది. అయితే, ఆ సుదీర్ఘ ప్రతిష్టంభన మన ప్రయోజనాలకు ఏమాత్రం ఉపయోగపడలేదని నా అభిప్రాయం. అది వారికి కూడా ఏ విధంగానూ మేలు చేయలేదు. మన సంబంధాల్లో మెరుగుదల అనేది కేవలం చైనాతోనే కాకుండా, ప్రపంచ దేశాలతో మనకున్న సంబంధాల్లోనూ మన స్థానాన్ని బలోపేతం చేస్తుందని నేను భావిస్తున్నాను." అని జైశంకర్? అన్నారు. ఇటీవల కాలంలో ఇరు దేశాల సంబంధాల్లో సానుకూల మార్పులు కనిపిస్తున్నాయి. ఇందులో భాగంగానే బ్రిక్స్ (దీ=xజూ) సదస్సు కోసం చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ భారత్‌లో పర్యటించడం వంటి పరిణామాలు జరిగాయి.

'భాగస్వామ్య దేశాలు అర్థం చేసుకోకుంటే ద్వైపాక్షిక సంబంధాలపై ప్రభావం'

మరోవైపు సీమాంతర ఉగ్రవాదమే భారత్‌కు ఉన్న ప్రధాన ఆందోళన అని విదేశాంగమంత్రి జా.జైశంకర్ అన్నారు. దశాబ్దాలుగా పొరుగు దేశం ఉద్దేశపూర్వకంగా ఉగ్రవాదాన్ని ప్రేరేపిస్తోందని పాకిస్థాన్‌ను ఉద్దేశించి తీవ్రస్థాయిలో విమర్శించారు. ప్రపంచంలో మరే దేశం కూడా భారత్‌లా ఉగ్రవాద బాధితురాలిగా లేదన్నారు. కీలకమైన ఈ ఆందోళనలను భాగస్వామ్య దేశాలు అర్థం చేసుకోకపోతే ద్వైపాక్షిక సంబంధాలపై కచ్చితంగా ప్రతికూల ప్రభావం పడుతుందని జైశంకర్ హెచ్చరించారు. మరోవైపు భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం ఖరారైతే ఇరు దేశాల సంబంధాలు మరింత మెరుగుపడతాయని జైశంకర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ట్రంప్ హయాంలో అమెరికా-పాకిస్థాన్ మధ్య బంధం బలపడుతున్న నేపథ్యంలో జైశంకర్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

'తరంగ్ శక్తి' విన్యాసాల్లో అమెరికా ఏఫ్-35 యుద్ధ విమానాలు ఎంట్రీ

భారత్‌లో జరుగుతున్న 'తరంగ్ శక్తి 2026' విన్యాసాల్లో అమెరికా వైమానిక దళానికి చెందిన ఎఫ్-35ఏ లైట్నింగ్ ఐఐ స్టెల్త్ ఫైటర్ జెట్‌లు చరిత్రాత్మకంగా పాల్గొనడంపై ఇండియాలోని యూఎస్ ఎంబసీ హర్షం వ్యక్తం చేసింది. ఈ అధునాతన విమానం భారత గగనతలంలోలోకి అడుగుపెట్టిందని పేర్కొంది. ఎఫ్-35ఏ విమానాలు తరంగ్ శక్తి విన్యాసాల్లో భాగంగా భారత్‌లో తమ తొలి అడుగు వేస్తున్నాయని వెల్లడించింది. అదే సమయంలో ఈ విమానం అసాధారణ సామర్థ్యాలను, అలాగే భారత వైమానిక దళం (ఐఏఎఫ్), దాని మిత్ర దేశాల ఎయిర్‌ఫోర్స్‌లతో కలిసి ఇది సృష్టించే విలువైన ద్వైపాక్షిక శిక్షణా అవకాశాలను కూడా చెప్పింది. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో భారత్‌లోని యూఎస్ ఎంబసీ పోస్ట్ పెట్టింది. "అమెరికా వైమానిక దళానికి చెందిన ఎఫ్-35ఏ లైట్నింగ్ ఐఐ స్టెల్త్ ఫైటర్ జెట్‌లు తరంగ్ శక్తి- 2026లో పాల్గొన్నాయి. తద్వారా ఈ అధునాతన విమానం భారత గగనతలంలో తొలిసారిగా కార్యాచరణలోకి దిగింది. స్టీల్త్, అధునాతన సెన్సార్లు, సమాచార భాగస్వామ్య సామర్థ్యాలను కలపడం ద్వారా ఎఫ్-35 విమానాలు భారత వైమానిక దళం, ఇతర భాగస్వాములతో కలిసి శిక్షణ పొందేందుకు కొత్త అవకాశాలను అందిస్తున్నాయి. తద్వారా రెండు దేశాల మధ్య సైనిక సహకారం, సమన్వయం, రక్షణ సంసిద్ధత మరింత బలపడుతుంది. "

జోధ్‌పుర్ వేదికగా 'తరంగ్ శక్తి' విన్యాసాలు

తరంగ్ శక్తి రెండో విడత విన్యాసాలు రాజస్థాన్‌లోని జోధ్‌పుర్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో సెప్టెంబరు 26న ప్రారంభమయ్యాయి. అవి అక్టోబర్ 12 వరకు జరుగుతాయి. 'పవర్ ఇన్ పార్ట్‌నర్‌షిప్' (భాగస్వామ్యంలో శక్తి) అనే థీమ్‌తో ఈ ఏడాది ఈ విన్యాసాలు జరుగుతున్నాయి. అగ్రరాజ్యం అమెరికాతో పాటు ఫ్రాన్స్, జర్మనీ, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, శ్రీలంక, యూఏఈలకు చెందిన వాయుసేన బృందాలు విన్యాసాల్లో పాల్గొంటాయని ఇండియన్ ఎయిర్ ఫోర్స్ మంగళవారం ప్రకటించింది. అలాగే ఇంకొన్ని దేశాలు పరిశీలకులుగా హాజరవుతాయని స్పష్టం చేసింది. దేశ రక్షణ సామర్థ్యాలను ప్రదర్శించడంతో పాటు వివిధ దేశాల వాయుసేనల మధ్య సమన్వయాన్ని పెంపొందించడమే ఈ విన్యాసాల ప్రధాన ఉద్దేశమని వెల్లడించింది.

భారత్ తరఫున ఏయే విమానాలంటే?

యూఎస్ ఎఫ్-35తో పాటు ఫ్రాన్స్ రఫేల్, యూఏఈ ఎఫ్-16, బంగ్లాదేశ్ సీ-130జే విమానాలు రెండు వారాలపాటు విన్యాసాలు చేపట్టనున్నాయి. భారత్ తరఫున రఫేల్, మిరాజ్-2000, జాగ్వార్, తేజస్, మిగ్-29, సుఖోయ్-30ఎంకేఐ తదితర విమానాలు ఈ విన్యాసాల్లో పాల్గొంటున్నాయి. ఏరో ఇండియా 2025లో ఎఫ్-35 (ఖీ-35) పాల్గొన్నప్పటికీ తరంగ్ శక్తిలో మాత్రం తొలిసారి ప్రదర్శన ఇదే. 2024లో జరిగిన తరంగ్ శక్తి మొదటి విడత విన్యాసాల్లో ఎఫ్-35 పాల్గొనలేదు. కాగా, తరంగ్ శక్తి విన్యాసాల ప్రధాన ఉద్దేశం వివిధ దేశాల వైమానిక దళాల మధ్య పరస్పర సహకారం, సమన్వయం, వ్యూహాత్మక నైపుణ్యాలను పెంపొందించడమే. తరంగ్ శక్తి మొదటి విడత విన్యాసాలు 2024లో జరిగాయి. ప్రతి రెండేళ్లకు ఒకసారి ఈ విన్యాసాలు జరుగుతాయి. తరంగ్ శక్తి-2026 విన్యాసాలు ఐఏఎఫ్ తన కార్యాచరణ నైపుణ్యాన్ని, సంస్థాగత నైతిక విలువలను ప్రదర్శించడానికి ఒక ప్రధాన వేదికగా ఉపయోగపడతాయి. అదే సమయంలో నిర్మాణాత్మక రక్షణ దౌత్యం, ప్రాంతీయ భద్రత, శాశ్వత సైనిక భాగస్వామ్యాల పట్ల భారత్ దృఢమైన నిబద్ధతను ఇవి పునరుద్ఘాటిస్తాయి.

అమెరికా వైమానిక శక్తి జోధ్‌పుర్‌కు చేరుకుంది!: సెర్గియో గోర్

తరంగ్ శక్తి విన్యాసాలు ప్రారంభమైన రోజే భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియా గోర్ కీలక వ్యాఖ్యలు చేశారు. బహుళపక్ష వైమానిక విన్యాసాలలో అమెరికా అగ్రశ్రేణి ఐదో తరం యుద్ధ విమానాలు తొలిసారిగా ప్రదర్శించడాన్ని చూడటానికి తాను ఆసక్తిగా ఉన్నానని అన్నారు. "అమెరికా వైమానిక శక్తి జోధ్‌పుర్‌కు చేరుకుంది! 'తరంగ్ శక్తి' విన్యాసాలలో తొలిసారిగా పాల్గొనేందుకు ఆరు ఎఫ్-35 లైట్నింగ్ ఐఐ యుద్ధ విమానాలు, 200 మందికి పైగా వైమానిక దళ సిబ్బంది ప్రస్తుతం భారతదేశంలో ఉన్నారు. భారత వైమానిక దళం, భాగస్వామ్య దేశాల విమానాలతో కలిసి అమెరికాకు చెందిన అత్యున్నత శ్రేణి ఐదో తరం యుద్ధ విమానాలు 'తరంగ్ శక్తి'లో అరంగేట్రం చేయడం పట్ల ఎంతో ఉత్సాహంగా ఉన్నాను." అని సెర్గియో గోర్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు.

మహిళలను ఇళ్లలో బంధించడం సమస్యకు పరిష్కారం కాదు

దేశ రాజధాని దిల్లీలో మహిళల భద్రతను కోరుతూ విద్యార్థులు చేస్తున్న నిరసనలకు కాంగ్రెస్ అగ్రనాయకుడు, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మద్దతు తెలిపారు. యువతులు, ముఖ్యంగా జెన్‌జీకి చెందినవారు ఈ నిరసనల్లో భారీ సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. మహిళలపై జరిగిన నేరాల కారణంగా వారిపైనే ఆంక్షలు విధించకూడదని పేర్కొన్నారు. సురక్షితమైన బహిరంగ ప్రదేశాలు ఉండాలని, నేరస్థులపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. మహిళలను ఇంట్లోనే బంధించడం ఈ నేరాలకు పరిష్కారం కాదన్నారు. ఈ మేరకు రాహుల్ 'ఎక్స్'లో పోస్ట్ పెట్టారు.

'ప్రభుత్వం ఒత్తిడి ఉన్నప్పుడే స్పందిస్తుంది'

బాధితురాలిని నిందించి, నేరస్థుడిని కాపాడే వ్యవస్థను సమూలంగా మార్చాలని రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. మహిళలపై వేధింపులు, అత్యాచారాలకు వ్యతిరేకంగా నిరసన తెలపాలని ఆయన యువతను కోరారు. ఎందుకంటే ప్రభుత్వం కేవలం ఒత్తిడి ఉన్నప్పుడే స్పందిస్తుందని పేర్కొన్నారు. శాంతియుత నిరసన తెలపడం ప్రజాస్వామ్య హక్కు అని, ఆ నిరసనలకు తాను సంపూర్ణ మద్దతు ఇస్తానని ప్రకటించారు. ఎల్ఎస్ఆర్ (లేడీ శ్రీరామ్) కాలేజీ దగ్గర్లోని పార్కుకు వాకింగ్ కోసం కోసం వెళ్లిన ఒక యువతి అత్యాచారానికి గురైందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతిరోజూ వార్తాపత్రికలు, సోషల్ మీడియా చూస్తే బిహార్‌లో ఒక బాలికపై, యూపీలో మరొకరిపై, పంజాబ్‌లో ఇంకొకరిపై అత్యాచారం జరిగిందన్న వార్తలు కనిపిస్తున్నాయని అన్నారు. "మహిళలపై జరిగిన నేరాలకు వారిని శిక్షించడం ఆపండి. దేశవ్యాప్తంగా మహిళలు వీధుల్లో నడవడానికి భయపడుతున్నారు. వేధింపులు, అత్యాచారానికి గురవుతామని భయపడుతున్నారు. దీనికి ప్రభుత్వ సమాధానం- ఇంట్లోనే ఉండండి. ఇది పురుషాధిక్య ధోరణ తీరు: బాధితురాలిని నిందించి, నేరస్థుడిని కాపాడే వ్యవస్థ. దీనిని బద్దలు కొట్టాల్సిన సమయం ఆసన్నమైంది. మహిళలపై నేరాలకు ప్రతిస్పందనగా బహిరంగ ప్రదేశాలను సురక్షితంగా మార్చాలి. నేరాలకు పాల్పడిన వారిపై త్వరితగతిన చర్యలు తీసుకోవడంపై దృష్టి పెట్టాలి. మహిళలపై నేరాలను అరికట్టేందుకు వారిని ఇళ్లలోనే బంధించడం పరిష్కారం కాదు. దేశంలోని వీధులను సురక్షితంగా మార్చాలి. మహిళలను వేధించే పురుషుల మనస్తత్వాన్ని మార్చాలి. మహిళలపై దాడి చేసే వారిని త్వరితగతిన, ఎటువంటి మినహాయింపు లేకుండా శిక్షించడమే పరిష్కారం."

స్టూడెంట్స్ నిరసనలు

ఈ నెల ప్రారంభంలో దక్షిణ దిల్లీలోని ఆస్థా కుంజ్ పార్కులో 17 ఏళ్ల బాలికపై సామూహిక అత్యాచారం జరిగిన నేపథ్యంలో మహిళల భద్రత కోసం దిల్లీ విశ్వవిద్యాలయం విద్యార్థులు నిరసనలకు దిగారు. మొదటి నిరసన ప్రదర్శన సెప్టెంబర్ 23న జరిగింది. ఆ రోజు దిల్లీ విశ్వవిద్యాలయం, దాని అనుబంధ సంస్థలైన లేడీ శ్రీరామ్ కాలేజ్ ఫర్ ఉమెన్, మిరాండా హౌస్, గార్గీ కాలేజ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీకి చెందిన సుమారు 200 మంది విద్యార్థులు వీధుల్లోకి వచ్చారు. క్యాంపస్‌ల పరిసరాల్లో వేధింపులు, నిఘా లేమి, పోలీసు పహారా, ఇంకా విద్యాసంస్థలకు రాకపోకలు సాగించే మహిళల భద్రతపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిరసనలకు రాహుల్ మద్దతు ప్రకటించారు.

బీజేపీ సీఎంపై ఆప్ ఫైర్

అలాగే దేశ రాజధాని దిల్లీలో మహిళలు, విద్యార్థుల భద్రతపై ఆప్ సైతం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. మహిళల భద్రత విషయంలో దిల్లీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ప్రశ్నించింది. "బీజేపీ మహిళా ముఖ్యమంత్రి వల్ల దిల్లీ ఏం సాధించింది? కల్కాజీ ఆలయం నుంచి తిరిగి వస్తుండగా 17 ఏళ్ల బాలికపై ముగ్గురు వ్యక్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఎల్ఎస్ఆర్ వంటి ప్రతిష్టాత్మక కళాశాల కూడా ఆన్‌లైన్ తరగతులు నిర్వహించాల్సి వస్తోంది. దిల్లీలో ప్రతిరోజూ బాలికలపై అత్యాచారాలు, లైంగిక వేధింపులు జరుగుతున్నాయి. " అని దిల్లీ ఆప్ అధ్యక్షుడు సౌరభ్ భరద్వాజ్ పేర్కొన్నారు. మరోవైపు, కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నేతృత్వంలోని జనగణన కమిటీ (డెమోగ్రఫీ ప్యానెల్) గత 15 ఏళ్ల జనన, వాహన రిజిస్ట్రేషన్లు, పాఠశాల నమోదులు, ఆస్తి లావాదేవీలకు సంబంధించిన మతాల వారీగా డేటాను రాష్ట్ర ప్రభుత్వాల నుంచి కోరినట్లు వచ్చిన వార్తలపై కాంగ్రెస్ స్పందించింది.

బిజినెస్

మళ్లీ పెరుగనున్న సిమెంట్ ధరలు..
అక్టోబర్‌లో బస్తాకు రూ.20 వరకు పెరిగే ఛాన్స్..!



సిమెంట్ ధరలు మళ్లీ పెరగనున్నాయి. సెప్టెంబర్‌లో దేశవ్యాప్తంగా సిమెంట్ బస్తా సగటు ధర రూ.7 పెరుగగా అక్టోబర్‌లో మరో రూ.20 వరకు పెంచే అవకాశం ఉందని సెంట్రమ్ బ్రోకింగ్ నివేదిక తెలిపింది. అయితే పెంచిన ధరలను కంపెనీలు ఎంతకాలం కొనసాగిస్తాయన్నది డిమాండ్ పరిస్థితులపై ఆధారపడి ఉంటుందని పేర్కొన్నది. సెప్టెంబర్‌లో దేశవ్యాప్తంగా సిమెంట్ బస్తా సగటు ట్రేడ్ ధర రూ.356 కు చేరింది. జూలై, ఆగస్టు నెలల్లో ధరలు దాదాపు స్థిరంగా ఉండగా సెప్టెంబర్‌లో మాత్రం ధరల పెరుగుదల కనిపించింది. ట్రేడ్ సెగ్మెంట్‌తోపాటు నాన్-ట్రేడ్ విభాగంలోనూ ధరలు పెరిగాయని సెంట్రమ్ తెలిపింది. అయితే కొన్ని ప్రాంతాల్లో కంపెనీలు పెంచిన ధరల భారాన్ని డీలర్లు పూర్తిగా వినియోగదారులపై మోపలేదు. ఇదిలావుంటే పెరిగిన ఇంధన ఖర్చులు సిమెంట్ కంపెనీలపై ఒత్తిడి పెంచుతున్నాయి. దాంతో అధిక ధరలను అమలు చేసి కొనసాగించడం కంపెనీలకు మరింత కీలకంగా మారొచ్చని నివేదిక పేర్కొన్నది. రెండో త్రైమాసికంలో సిమెంట్ డిమాండ్ సాధారణ స్థాయికంటే బలహీనంగా ఉన్నప్పటికీ సీజనల్ మందగమనంతో పోలిస్తే తగ్గుదల తక్కువగానే ఉందని సెంట్రమ్ తెలిపింది. త్రైమాసికం చివర్లో కొన్ని మార్కెట్లలో నిర్మాణ కార్యకలాపాలు పుంజుకోవడంతో అక్టోబర్‌లో మరోసారి ధరలు పెంచేందుకు కంపెనీలకు అవకాశం ఏర్పడిందని పేర్కొన్నది. ప్రాంతాల వారీగా చూస్తే సెప్టెంబర్‌లో దక్షిణ భారతదేశంలో సిమెంట్ ధరలు అత్యధికంగా రూ.11 పెరిగాయి. పశ్చిమ భారతంలో రూ.9, మధ్య, తూర్పు, ఉత్తర భారతంలో ఒక్కో బస్తాపై రూ.5 చొప్పున ధరలు పెరిగాయి.

నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్.. వరుసగా రెండో రోజూ పతనం.. సెన్సెక్స్ 243 పాయింట్లు లాస్



భారతీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం నష్టాల్లో ముగిశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 242 పాయింట్లు నష్టపోగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 64 పాయింట్ల నష్టాన్ని చవిచూసింది. సెన్సెక్స్ ఉదయం 72,633.68 పాయింట్ల వద్ద నష్టాల్లోనే మొదలైంది. ఒక దశలో 700 పాయింట్ల కనిష్ట నష్టాన్ని తాకింది. చివరకు కొంచెం కోలుకుంది. ట్రేడింగ్ ముగిసే సమయానికి 242.65 పాయింట్ల నష్టంతో 72,529.07 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 64.05 పాయింట్లు నష్టపోయి, 22,716.20 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో అదానీ పోర్ట్స్, ఎస్బీఐ, సన్‌ఫార్మా, కోటక్ మహీంద్రా బ్యాంక్, టాటా స్టీల్ షేర్లు లాభాల్లో నడిచాయి. అదానీ పోర్ట్స్ ఏకంగా 4.39 శాతం లాభపడింది. మరోవైపు హిందుస్తాన్ యునీలీవర్, టీసీఎస్, అల్ట్రాటెక్ సిమెంట్, టైటాన్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. టైటాన్ అత్యధికంగా 2.72 శాతం నష్టపోయింది. 30 ఇండెక్స్‌లో 12 షేర్లు లాభపడగా, 18 కంపెనీల షేర్లు నష్టాల్లో సాగాయి. ఎన్ఎస్ఈ నిఫ్టీ 50లో 17 షేర్లు లాభపడగా, 32 నష్టాల్లో ముగిశాయి. ఒకటి లాభనష్టాలు లేకుండా ఉంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ ఫ్లాట్‌గా ముగిసింది. 0.10 శాతం లాభపడిన రూపాయి డాలర్‌తో 95.97 వద్ద కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ఔన్స్ ధర 4419 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. మరోవైపు బ్రెంట్ క్రూడాయిల్ ధర భారీగా పెరిగింది. బ్యారెల్ క్రూడాయిల్ ధర 104 డాలర్ల వద్ద కొనసాగుతోంది. ఇరాన్-అమెరికా యుద్ధం ఇంకా కొనసాగే పరిస్థితులు చమురు ధరలు పెరిగేందుకు కారణాలు.

పండుగల వేళ పప్పుల ధరలకు రెక్కలు..
సామాన్యులకు చుక్కలు..!



పండుగల వేళ పప్పుల ధరలు సామాన్య ప్రజలకు షాకిస్తున్నాయి. నిత్యావసరాలైన పప్పుధాన్యాల ధరలు అమాంతం పెరిగిపోయాయి. ముఖ్యంగా శనగ కంది పెసర లాంటి పప్పుల ధరలు గత కొన్ని వారాల్లోనే చుక్కలనంటాయి. 'ఇండియన్ పల్సెస్ అండ్ గ్రెయిన్స్ అసోసియేషన్ గణాంకాల ప్రకారం కొన్ని రకాల పప్పుల హోల్‌సేల్ ధరలు గడిచిన నెల రోజుల్లోనే 11 శాతానికిపైగా పెరిగాయి. దేశంలో అత్యధికంగా వినియోగించే శనగపప్పు ధర నెల రోజుల్లో 11 శాతం, వారం రోజుల్లో 5.5 శాతం పెరిగింది. పెసరపప్పు 10.6 శాతం, కందిపప్పు 6.5 శాతం, బఠాణీ 6 శాతం మేర పెరిగాయి. గడిచిన ఏడాదితో పోలిస్తే శనగపప్పు ధర 23 శాతం, బఠాణీ 47 శాతం, మినప పప్పు ధర 24 శాతం అధికంగా ఉన్నాయి. సోమవారం నాటి రిటైల్ మార్కెట్ సగటు ధరలను పరిశీలిస్తే కిలో శనగపప్పు రూ.88.72, కందిపప్పు రూ.125.72, పెసరపప్పు రూ.112.14, మసూర్ పప్పు రూ.90.43 గా నమోదయ్యాయి. పండుగ సీజన్ కావడంతో ఇళ్లలో నిత్యావసర సరుకుల నిల్వలు పెంచుకోవడం ఈ ధరల పెరుగుదలకు తక్షణ కారణంగా కనిపిస్తున్నప్పటికీ దీని వెనుక బలమైన సరఫరా ఆందోళనలు కూడా ఉన్నాయని వ్యాపారులు, పరిశ్రమ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ముఖ్యంగా పప్పుధాన్యాలను అధికంగా పండించే మహారాష్ట్ర, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో వర్షాభావ పరిస్థితులు, నేలలో తేమ తగ్గడం వంటి కారణాలతో ఖరీఫ్ పంట దిగుబడిపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇది ప్రత్యేకంగా కందిపప్పు ఉత్పత్తిపై ప్రభావం చూపనుంది.

ఫిక్సుడ్ డిపాజిట్లపై కొత్త రూల్స్.. అక్టోబర్ 1 నుంచి అమల్లోకి..!



బ్యాంకులలో ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేసే పెద్ద మొత్తపు డిపాజిటర్ల కోసం ఆర్‌బీఐ కొత్త నిబంధనలను తీసుకొచ్చింది. ఈ మార్పులు వచ్చే నెల 1వ తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. బ్యాంకులు అందించే వడ్డీ రేట్లలో మరింత పారదర్శకత, స్థిరత్వం తీసుకురావడమే ఈ కొత్త విధానం ప్రధాన లక్ష్యమని తెలుస్తున్నది. ముఖ్యంగా రూ.3 కోట్లు అంతకంటే ఎక్కువ విలువైన టర్మ్ డిపాజిట్లను 'బల్క్ డిపాజిట్లుగా పరిగణిస్తారు. ఈ కొత్త నిబంధనలు ప్రధానంగా ఇలాంటి పెద్ద డిపాజిటర్ల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని రూపొందించబడ్డాయి. వచ్చే నెల 1 నుంచి షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులు సహా నిర్దేశిత ఆర్థిక సంస్థలన్నీ తమ బల్క్ డిపాజిట్లపై అందించే వడ్డీ రేట్లను ప్రతి పనిదినం ఉదయం 10 గంటలలోపు అధికారిక వెబ్‌సైట్లలో ప్రచురించాలి. ఒకవేళ ఏవైనా మార్పులు చేయాల్సి వస్తే అందుకు 10 నిమిషాల గ్రేస్ పీరియడ్ ఉంటుంది. ఇంకా ముఖ్యమైన విషయం ఏమిటంటే వెబ్‌సైట్‌లో ప్రకటించిన వడ్డీ రేటునే ఆ రోజు డిపాజిట్ చేసే కస్టమర్లకు తప్పనిసరిగా చెల్లించాలి. దీనివల్ల రేట్ల విషయంలో ఎలాంటి గందరగోళానికి తావుండదు. ఇప్పటివరకు ఒకే బ్యాంకుకు చెందిన వేర్వేరు బ్రాంచ్‌లలో ఒకే రకమైన బల్క్ డిపాజిట్‌కు స్వల్పంగా వేర్వేరు వడ్డీ రేట్లు ఇచ్చే అవకాశం ఉండేది. అయితే తాజా నిబంధనలతో ఆ పద్ధతికి తెరపడింది. కొత్త నిబంధన ప్రకారం.. ఇకపై ఒకేరోజు ఒకే బ్యాంకుకు చెందిన ఏ బ్రాంచ్‌లోనైనా ఒకే రకమైన డిపాజిట్‌కు ఒకే వడ్డీ రేటును అందించాల్సి ఉంటుంది. ఇది బ్రాంచ్‌ల మధ్య వివక్షను తొలగించి, డిపాజిటర్లకు ఏకరూపతను అందిస్తుంది. ఈ కొత్త నిబంధనల వల్ల చిన్న, మధ్యతరగతి రిటైల్ డిపాజిటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆర్‌బీఐ స్పష్టంచేసింది. ఈ మార్పులు కేవలం రూ.3 కోట్లు, ఆపైన చేసే బల్క్ డిపాజిట్లకు మాత్రమే వర్తిస్తాయి. సాధారణ ఎఫ్‌డీ కస్టమర్లకు ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనలు, వడ్డీ రేట్లు యథాతథంగా కొనసాగుతాయి. ఇప్పటికే చేసిన పాత ఎఫ్‌డీలపై వాటి కాలపరిమితి ముగిసే వరకు ఒప్పందం ప్రకారం పాత వడ్డీ రేట్లే వర్తిస్తాయి. ఈ నిబంధనలు వాణిజ్య బ్యాంకులు, స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, లోకల్ ఏరియా బ్యాంకులు, పేమెంట్ బ్యాంకులు, పట్టణ సహకార బ్యాంకులకు వర్తిస్తాయి

సీఎస్కే దూకుడు..
కొత్త బౌలింగ్ కోచ్‌గా మాజీ పేసర్..!



ఐపీఎల్ 20వ సీజన్ వేలానికి ముందే చెన్నై సూపర్ కింగ్స్ దూకుడు పెంచింది. సుదీర్ఘ కాలం హెడ్‌కోచ్‌గా సేవలందించిన స్టీఫెన్ ఫ్లెమింగ్‌కు బైబై చెప్పేసిన సీఎస్కే.. వరసగా కొత్త కోచ్‌లను ప్రకటిస్తోంది. ఇప్పటికే ప్రధాన కోచ్‌గా భారత మాజీ పేసర్ జహీర్ ఖాన్ ఎంపికవ్వగా.. తాజాగా బౌలింగ్ కోచ్‌ను దాదాపు ఖరారు చేసింది ఫ్రాంచైజీ. టీమిండియా మాజీ పేసర్ మోహిత్ శర్మకు తమ బౌలర్లను సానబెట్టే బాధ్యత అప్పగించనుందని సమాచారం. ఐపీఎల్ మేటి జట్లలో ఒకటైన చెన్నై సూపర్ కింగ్స్ కోచ్‌ల నియామకాల్లో వేగం చూపిస్తోంది. ఇరవయ్యో సీజన్ వేలానికి ముందే కోచింగ్ సిబ్బంది ఎంపిక పూర్తి చేయాలనే ఉద్దేశంతో ఉన్న సీఎస్కే.. ధోనీ సలహాలతో కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. స్టీఫెన్ ఫ్లెమింగ్ స్థానంలో వెటరన్ జహీర్ ఖాన్‌ను హెడ్‌కోచ్‌గా తీసుకుంది. ఇప్పుడు బౌలింగ్ కోచ్ వేటను ముగిస్తూ.. ఐపీఎల్‌లో సుదీర్ఘ అనుభవజ్ఞుడైన మోహిత్ శర్మను ఖరారు చేయనుంది చెన్నై. ఈ విషయంపై సీఈవో కాశీ విశ్వనాథన్ మీడియాతో మాట్లాడుతూ తమ కోచింగ్ సిబ్బందిలో మోహిత్ భాగం కానున్నాడనే ఈ విషయాన్ని వెల్లడించాడు... 'మా హెడ్‌కోచ్ జహీర్ ఖాన్ సహాయక సిబ్బందిని ఫైనల్ చేసే పనిలో ఉన్నాడు. అతడు మోహిత్ శర్మను బౌలింగ్ కోచ్‌గా ఎంపిక చేశాడు' అని ఆయన పేర్కొన్నాడు. అయితే.. అధికారికంగా మాత్రం మోహిత్ పేరు ప్రకటించలేదు. త్వరలోనే ఎరిక్ సిమన్స్ స్థానంలో నూతన బౌలింగ్ కోచ్‌గా మోహిత్ బాధ్యతలు చేపట్టే అవకాశముంది. సీఎస్కే తదుపరి బౌలింగ్ కోచ్‌గా దాదాపు ఖరారైన మోహిత్‌ను సంప్రదించగా.. మళ్లీ చెన్నై గూటికి చేరితే తాను చాలా సంతోషిస్తానని తెలిపాడు. 'సీఎస్కేలో కుటుంబంలో చేరుతున్నందుకు చాలా సంతోషంగా ఉంది. నాకు ఆఫర్ రాగానే ఇంకేమీ ఆలోచించలేదు. వెంటనే ఎస్ అని చెప్పేశా. నాకు సీఎస్కే చాలా ప్రత్యేకం. ధోనీ ఉన్నప్పుడు అంతా మంచిగానే జరిగింది. ఇప్పుడు మరోసారి చెన్నై గూటికి చేరడానికి ఆతృతతో ఉన్నా. ఈసారి అందరం కలిసి గొప్ప ఫలితాలు సాధిస్తాం. సీఎస్కే అభిమానులారా.. మిమ్మల్ని త్వరలోనే కలుస్తా' అని మోహిత్ పేర్కొన్నాడు. ఐపీఎల్‌లో చెన్నై తరపున డెత్ ఓవర్ స్పెషలిస్ట్‌గా విజయవంతమైన మోహిత్.. భారత్ తరపున 8 టీ20లు ఆడాడు. 2013 నుంచి 2015 వరకూ.. ఆపై 2019లో సీఎస్కేకు వచ్చేశాడు మోహిత్. ధోనీ కెప్టెన్సీలో రాటుదేలిన అతడు.. 2014లో 23 వికెట్లతో పర్పుల్ క్యాప్ అందుకున్నాడు.

టీ20ల్లో చరణి సంచలనం.. అత్యధిక రేటింగ్‌తో 'ఆల్‌టైమ్ రికార్డు' సొంతం..!



అంతర్జాతీయ టీ20ల్లో భారత స్పిన్నర్ శ్రీచరణి చరిత్ర సృష్టించింది. ఇప్పటికే నంబర్ 1బౌలర్‌గా కొనసాగుతున్న ఈ మిస్టరీ స్పిన్నర్ అత్యధిక బౌలింగ్ రేటింగ్‌తో ఆల్‌టైమ్ రికార్డు నెలకొల్పింది. ఏడాది కాలంగా నిలకడగా రాణిస్తున్న చరణి 817 పాయింట్లతో ఆస్ట్రేలియా పేసర్‌ను దాటేసింది. ఇదివరకు టీ20 బౌలర్లలో అత్యధిక రేటింగ్ మేగన్ షట్ పేరిట ఉండేది. కానీ.. ఇటీవల మహిళల ఆసియా కప్, ఆసియా క్రీడల్లో అదరగొడుతున్న ఈ తెలుగమ్మాయికి అగ్రస్థానం దక్కింది. అంతర్జాతీయ టీ20ల్లో తిప్పేస్తున్న శ్రీ చరణి మరోసారి అత్యధిక రేటింగ్ పాయింట్లతో చరిత్ర సృష్టించింది. ఈ మధ్యే నంబర్ 1 టీ20 బౌలర్‌గా అవతరించిన ఈ తెలుగమ్మాయి కొన్ని రోజుల క్రితమే 800 పాయింట్ల క్లబ్‌లో చేరింది. తద్వారా ఈ మైలురాయిని అందుకున్న టీమిండియా తొలి బౌలర్‌గా చరణి మరో రికార్డు సొంతం చేసుకుంది. ఆసియా క్రీడల్లో రాణించిన తను.. ఏకంగా 817 పాయింట్లతో ఆల్‌టైమ్ రికార్డు నెలకొల్పింది. దాంతో.. గతంలో అత్యధికంగా 807 రేటింగ్‌తో మేగన్ షట్(ఆస్ట్రేలియా) రికార్డు కనుమరుగైంది. 2018 నవంబర్‌లో ఆసీస్ పేసర్ ఇన్నేసి రేటింగ్ పాయింట్లు సాధించింది. ఎనిమిదేళ్లు తిరిగే సరికి శ్రీ చరణి ఆమెను రెండో స్థానానికి నెట్టేసింది.

ఏడాదిలోనే నంబర్ 1

ఏడాది క్రితం అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన శ్రీ చరణి నంబర్ 1 ర్యాంక్ పట్టేసింది. నిలకడగా రాణిస్తున్న ఈ తెలుగమ్మాయి అంతర్జాతీయ టీ20 బౌలర్ల ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానం సొంతం చేసుకుంది. ఇంగ్లండ్ వేదికగా జరుగుతున్న పొట్టి వరల్డ్‌కప్‌లో తిప్పేసిన ఈ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ అందర్నీ ఆశ్చర్యపరుస్తూ టాప్ ర్యాంక్‌కు ఎగబాకింది. ఇంగ్లండ్‌పై (2025 జూన్ 28న) మ్యాచ్ ద్వారా అంతర్జాతీయ పొట్టి ఫార్మాట్లో అడుగుపెట్టిన చరణి.. తన స్పిన్ మ్యాజిక్‌తో టీమిండియా విజయాల్లో కీలకవుతూనే.. వ్యక్తిగతంగా తన ర్యాంక్‌ను మెరుగుపరుచుకుంది. గతేడాది స్వదేశంలో 14 వికెట్లతో హర్మన్‌ప్రీత్ కౌర్ సేన తొలిసారి వన్డే ప్రపంచకప్ గెలవడంలో కీలకమైందీ కడప బిడ్డ. తాజాగా ఆసియా కప్‌లో 12, ఆసియా క్రీడల్లో ఎనిమిది వికెట్లతో మెరిసింది చరణి.

స్పోర్ట్స్


రీలేలో చిరస్మరణీయ పసిడి..
ఆసియా క్రీడల్లో భారత్ హాఫ్ సెంచరీ..!



ఆసియా క్రీడల్లో భారత బృందం హాఫ్ సెంచరీ కొట్టింది. షూటర్లు, అథ్లెట్లు విజృంభించి పతకాలు కొల్లగొట్టగా పదోరోజుకు పతకాల సంఖ్య యాభై దాటింది. మంగళవారం షూటర్ నీరూ ధండా ట్రాక్ విభాగంలో స్వర్ణం అందించగా.. అథ్లెటిక్స్‌లో మహిళల రీలే టీమ్ చిరస్మరణీయ పసిడితో గర్జించింది. వీరి స్ఫూర్తితో పురుషుల రీలే జట్టు కూడా కాంస్యం గెలుపొందగా భారత్ ఖాతాలో 52వ పతకం చేరింది. ఐచీ నగోయలో జరుగుతున్న ఆసియా క్రీడల్లో వంద పతకాలు లక్ష్యంగా సాగుతున్న భారత్ హాఫ్ సెంచరీ కొట్టింది. వరసగా వెండి, కాంస్యాలకే పరిమితమైన మన అథ్లెట్లు మంగళవారం పసిడితో మెరిశారు. మహిళల 4ఐ400మీ టీమ్ ఫైనల్లో పసిడి విద్య రామరాజ్, కిరణ్ పహల్ , ప్రాచీ, పూవమ్మల బృందం అగ్రస్థానంలో నిలిచింది. అంతకుముందు మహిళల హై జంప్‌లో పూజ, పురుషుల 5వేల మీటర్ల పరుగులో గుల్వీర్ సింగ్ కాంస్యంతో మెరిశారు.

గుల్వీర్ హ్యాట్రిక్

విద్య రామరాజ్ నేతృత్వంలోని మహిళల 4ఐ400మీ టీమ్ స్వర్ణ కాంతులు వెదలజల్లిన కాసేపటికే పురుషుల రీలే టీమ్ కూడా 4ఐ400మీ విభాగంలో కంచు మోత మోగించింది. ధరమ్‌వీర్ చౌదరీ, మను థీక్కినిల్, జై కుమార్, విశాల్ థీన్నరసులతో కూడిన చతుష్టయం అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి 3:00.32తో లక్ష్యాన్ని పూర్తి చేసింది. దాంతో.. భారత్ ఖాతాలో 52వ పతకం చేరింది. మారథాన్ రన్నర్ గుల్వీర్ హ్యాట్రిక్ మెడల్స్(1500మీ, 10000మీ, 5000మీ) సాధించగా.. ప్రస్తుతం ఇండియా ఆరు స్వర్ణాలు, 21 రజతాలు, 25 కాంస్యాలు గెలుపొందింది.



కోటి వ్యూస్‌తో బిజినెస్ సర్కిల్స్‌లో క్రేజ్ పెంచేసిన సత్యదేవ్ “సమవర్తి” సినిమా టీజర్


వైవిధ్యమైన చిత్రాల్లో నటిస్తూ హీరోగా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు యంగ్ టాలెంటెడ్ హీరో సత్యదేవ్. ఆయన హీరోగా “సమవర్తి” అనే ఇంట్రెస్టింగ్ సినిమాలో నటిస్తున్నారు. సత్యదేవ్ హీరోగా నటిస్తున్న 16వ చిత్రమిది. “సమవర్తి” సినిమాను రుద్ర పిక్చర్స్ బ్యానర్ ఉ పంచభూత ప్రొడక్షన్స్, స్ పై శివచరణ్ రెడ్డి జక్కిడి, శశిధర్ రెడ్డి పడమటి నిర్మిస్తున్నారు. అజయ్ నాగ్. వి దర్శకత్వం వహిస్తున్నారు. ఎకోలాజికల్ యాక్షన్ థ్రిల్లర్ గా తెరకెక్కుతున్న ఈ సినిమా త్వరలోనే తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళంలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది.
రీసెంట్ గా రిలీజ్ చేసిన “సమవర్తి” టీజర్ హ్యూజ్ రెస్పాన్స్ తెచ్చుకుంది. ఈ టీజర్ కు ఇప్పటిదాకా కోటికి పైగా డిజిటల్ వ్యూస్ దక్కాయి. “సమవర్తి” టీజర్ బిజినెస్ సర్కిల్స్ లో మూవీపై క్రేజ్ పెంచేసింది. ఈ సినిమాకు భారీ స్థాయిలో బిజినెస్ ఎంక్వైరీస్ జరుగుతున్నాయి. టీజర్ లో పరిచయం చేసిన “సమవర్తి” ప్రపంచం ప్రతి ఒక్కరినీ మెస్మరైజ్ చేస్తోంది. సత్యదేవ్ కెరీర్ లో ఇదొక స్పెషల్ మూవీ అవుతుందనే అంచనాలు టీజర్ తోనే ఏర్పడ్డాయి. మేకర్స్ ఈ చిత్రాన్ని ఈ ఏడాదిలోనే రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మరిన్ని ఎగ్జైటింగ్ అప్డేట్స్ తో ప్రేక్షకుల్ని ఆకట్టుకునేందుకు “సమవర్తి” టీమ్ సన్నద్ధమవుతోంది. నటీనటులు – సత్యదేవ్, శ్రీకాంత్, దిలీష్ పోతన్, రాజీవ్ కనకాల, గానవి లక్ష్మణ్, రవీంద్ర విజయ్, మోహన్ భగత్, తదితరులు

తేజ సజ్జ హోస్ట్‌గా అమెజాన్ ప్రైమ్ వీడియోలో ‘ది ట్రైటర్స్’.. ఆసక్తికరంగా ప్రోమో!



అమెజాన్ ప్రైమ్ వీడియో ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన ప్రముఖ ఇంటర్నేషనల్ రియాలిటీ గేమ్ షో ‘ది ట్రైటర్స్’ ఇప్పుడు తెలుగు ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతోంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్ ద్వారా టాలెంటెడ్ యంగ్ హీరో తేజ సజ్జ రియాలిటీ షో హోస్ట్‌గా అరంగేట్రం చేస్తున్నారు. ఈ మేరకు ప్రైమ్ వీడియో సంస్థ అధికారిక ప్రకటనతో పాటు ఒక ఆసక్తికరమైన ప్రోమోను కూడా విడుదల చేసింది. ఈ హై-వోల్టేజ్ గేమ్ షో పూర్తిగా మోసాలు, వ్యూహాలు, రహస్య కూటములు మరియు ఊహించని మలుపుల ఆధారంగా సాగుతుంది. ఇందులో కొందరు కంటెస్టెంట్స్ ఇన్నోసెంట్స్‌గా ఉంటే, మరికొందరు ట్రైటర్స్‌గా వ్యవహరిస్తారు. ట్రైటర్స్ ఎవరనేది కనిపెట్టడానికి ఇన్నోసెంట్స్ చేసే ప్రయత్నాలు, మధ్యలో జరిగే ఉత్కంఠభరితమైన డ్రామా ప్రేక్షకులను ఎంతగానో అలరించనుంది. ఈ షో అక్టోబర్ 15 నుంచి అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా స్ట్రీమింగ్ కానుంది.

పులిలా వచ్చిన ఎన్టీఆర్.. చిత్రబృందం ఏర్పాట్లు అదుర్స్



ఫహాద్ ఫాజిల్ హీరోగా రానున్న చిత్రం ‘డోంట్ ట్రబుల్ ది ట్రబుల్’. శశాంక్ యేలేటి దర్శకత్వం వహించారు. సారా పాలేకర్, సౌరభ్ సచ్దేవా కీలక పాత్రల్లో నటించారు. ఎస్.ఎస్.రాజమౌళి, కార్తికేయ నిర్మాణ భాగస్వామ్యంతో రూపొందించారు. ఈ సినిమా అక్టోబర్ 2న తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. దీనికి సంబంధించిన ప్రీరిలీజ్ ఈవెంట్ ఈ రోజు (మంగళవారం)హైదరాబాద్‌లో నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా ఎన్టీఆర్ హాజరయ్యారు. చాలా కాలం తర్వాత రావడంతో చిత్ర బృంద వినూత్నంగా ఏర్పాట్లు చేసింది. స్ట్రీన్‌పై ‘యమదొంగ’ సీన్‌ని రీక్రియేట్ చేసింది. ఒక్కసారిగా అలా ఎన్టీఆర్ రావడంతో ఈవెంట్‌లో ఎన్టీఆర్.. ఎన్టీఆర్ అంటూ అభిమానులు అంతా మార్మోగేలా అరిచారు. ఇప్పుడీ వీడియో వైరల్ అవుతోంది.

ఏఐపై రాజమౌళి క్లారిటీ.. ఇకపై సినిమా అలా ఉండదట!



నేటి ఆధునిక ప్రపంచంలో కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం రోజురోజుకీ విస్తరిస్తోంది. ముఖ్యంగా ఏఐతో రూపొందిస్తున్న వీడియోలు, పోస్టర్లు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారుతున్నాయి. సినిమా రంగంలోనూ ఏఐ ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో.. దీనిపై అగ్ర దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.
ఏఐ గంటల్లో, నిమిషాల్లో పూర్తి చేస్తోంది
జార్జియా యూనివర్సిటీ విద్యార్థులతో మాట్లాడిన రాజమౌళి.. సినిమా రంగంలో ఏఐ వినియోగం, దాని ప్రభావం గురించి వివరించారు. ‘ఏఐ భవిష్యత్తు గమనం ఎలా ఉంటుందో ఊహించడం చాలా కష్టం. సాంకేతికత, దాని వినియోగాలు వేగంగా విస్తరిస్తున్నాయి. అయితే ఒక ప్రాజెక్ట్‌కు సంబంధించి పరిశోధన, అభివృద్ధి వంటి ప్రాథమిక పనులకు ఏఐ అద్భుతమైన సాధనం. గతంలో వారాలు, నెలలు పట్టే పనులను ఇప్పుడు ఏఐ గంటల్లో, నిమిషాల్లో పూర్తి చేస్తోంది’ అని అన్నారు. ఇకపై సినిమా చాలా తొందరగా పూర్తిచేసేందుకు అవకాశముందన్నారు. సినిమాల విషయానికొస్తే.. ప్రస్తుతం తాము ప్రాథమిక సమాచారాన్ని అభివృద్ధి చేసుకునేందుకు ఏఐని సహాయక సాధనంగా మాత్రమే ఉపయోగిస్తున్నామని రాజమౌళి తెలిపారు. డిజిటల్ కంటెంట్, సినిమా నిర్మాణంలో ఏఐపై ఆధారపడటం లేదని స్పష్టం చేశారు. ఇక మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి తెరకెక్కిస్తున్న వారణాసి చిత్రంలో కీలక సన్నివేశాలను మోషన్ క్యాప్చర్ సాంకేతికతతో ఇప్పటికే చిత్రీకరించినట్లు తెలుస్తోంది. ఈ సినిమా చిత్రీకరణ సింహభాగం పూర్తయినట్లు సమాచారం. ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది.
ఈ సినిమాను 50 భాషల్లోకి అనువదించి, 120 దేశాల్లో విడుదల చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

విడుదలకు ముందే షాక్.. ఆన్‌లైన్‌లో ‘తెల్లకాగితం’ సినిమా కంటెంట్ లీక్!



అక్టోబర్ 2న అట్టహాసంగా థియేటర్లలో విడుదల కావాల్సిన టాలీవుడ్ సినిమా ‘తెల్లకాగితం’ చిత్ర యూనిట్‌కు భారీ షాక్ తగిలింది. సినిమా విడుదలకు కేవలం మూడు రోజుల సమయం మాత్రమే ఉండగా.. ఈ చిత్రానికి సంబంధించిన కీలకమైన కంటెంట్ ఆన్‌లైన్‌లో లీక్ కావడం సినీ వర్గాల్లో కలకలం రేపింది. ఈ అనూహ్య పరిణామంతో చిత్ర నిర్మాతతో పాటు టెక్నీషియన్లు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. అయితే ఈ వ్యవహారంపై స్పందించిన ‘తెల్లకాగితం’ చిత్ర యూనిట్ సోషల్ మీడియా వేదికగా తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. సినిమాకు సంబంధించిన లీకైన కంటెంట్‌ను ఎవరూ డౌన్‌లోడ్ చేయవద్దని, సోషల్ మీడియాలో షేర్ చేయవద్దని మరియు ఇతరులకు సర్కులేట్ చేయవద్దని ప్రేక్షకులను హృదయపూర్వకంగా కోరింది. మా చిత్రం ‘తెల్లకాగితం’కు సంబంధించిన కంటెంట్ అనుమతి లేకుండా ప్రచారం చేయబడుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఈ సినిమా కంటెంట్‌ను చట్టపరంగా లీక్ చేయడాన్ని, షేర్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాము.

PRINTED AND PUBLISHED BY MUPPIRISETTY JAGADEESH, On behalf of CATERWEALTH MEDIA LLP, PRINTED at M/S. SREE SESHASAI ENTERPRISES, D.NO. NEW. 3-88, OLD. 3-22, GOSALA, CHANDRA THEATER ROAD, PENAMALURU-521151, KRISHNA DISTRICT, ANDHRA PRADESH, PUBLISHED AT CATERWEALTH MEDIA LLP, 3RD FLOOR, 59-12-9A, FIRST LINE, GAYATHRI NAGAR, VIJAYAWADA, NTR DISTRICT, ANDHRA PRADESH. EDITOR: MUPPIRISETTY JAGADEESH. RNI REGD NO. APTEL/2016/70247, Email I D : mahanagarap@gmail.com Phone : 9044417999